తెలంగాణ TELANGANA MUCHATLU
# ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
వరంగల్ | గురువారం - 24 - సెప్టెంబర్ - 2026 | సంపుటి : 4 | సంచిక : 111 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in



## ప్రపంచ పెట్టుబడుల గమ్యంగా
# తెలంగాణ

- **పెట్టుబడుల సదస్సుపై భట్టి సమీక్ష**
- **ఇన్వెస్ట్ తెలంగాణ సన్నాహక సమావేశం**
- **డిసెంబర్ 7 నుంచి 9 వరకు సదస్సు**
- **శాఖల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 23**
**(తెలంగాణ ముచ్చట్లు)**

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ -2026 నిర్వహణకు సంబంధించి రాష్ట్ర సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం జరిగింది. సదస్సు ఏర్పాట్లు, పెట్టుబడుల ఆకర్షణకు చేపట్టాల్సిన చర్యలు, శాఖల సమన్వయంపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని సదస్సును అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని సూచించారు. సమావేశంలో మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తదితరులు పాల్గొన్నారు. 2026 డిసెంబర్ 7 నుంచి 9 వరకు నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్‌కు సంబంధించిన ప్రణాళికలు, అంతర్జాతీయ భాగస్వామ్యం, పెట్టుబడిదారుల భాగస్వామ్యంపై సమగ్రంగా చర్చించారు. తెలంగాణను ప్రపంచ స్థాయి పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఈ సదస్సు కీలక వేదికగా మారాలని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు.

మిగతా 2 లో..

# సైనియోస్ హెల్త్‌కు
## హైదరాబాద్‌లో నూతన కేంద్రం

- **జీవ విజ్ఞాన రంగంలో నగరానికి మరో గుర్తింపు**
- **కృత్రిమ మేధ, పరిశోధనలకు ఊతమివ్వనున్న కేంద్రం**
- **ప్రపంచ ఆరోగ్య రంగానికి హైదరాబాద్ నుంచి సేవలు**
- **మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా ప్రారంభం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 23**
**(తెలంగాణ ముచ్చట్లు)**

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు హైదరాబాద్‌లో సైనియోస్ హెల్త్ నూతన గ్లోబల్ లైఫ్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవ విజ్ఞాన శాస్త్రం, కృత్రిమ మేధ, డేటా సాంకేతికతల సమన్వయంతో ఆరోగ్య రంగ భవిష్యత్తును నిర్మించడంలో హైదరాబాద్ కీలక కేంద్రంగా ఎదుగుతోందని తెలిపారు. ప్రపంచ స్థాయి సంస్థలు నగరంలో పెట్టుబడులు పెట్టడం తెలంగాణ అభివృద్ధికి నిదర్శనమన్నారు. హైదరాబాద్ జీవ ఔషధాలు, టీకాలు, పరిశోధన, తయారీ రంగాల్లో దశాబ్దాలుగా విశిష్ట స్థానం సంపాదించిందని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచ సంస్థలు ఆధునిక పరిశోధన, క్లినికల్ అభివృద్ధి,

మిగతా 2 లో..




## రిమ్స్ ఘటనపై కవిత విమర్శలు

- **ఎస్ఎన్‌సీయూ విభాగాన్ని పరిశీలించిన కవిత**
- **చిన్నారుల మరణాలపై తీవ్ర ఆవేదన**
- **వైద్య సదుపాయాలపై పలు ప్రశ్నలు**
- **బాధిత కుటుంబాలకు సాయం చేయాలని డిమాండ్**



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 23**
**(తెలంగాణ ముచ్చట్లు)**

ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాద ఘటనలో చిన్నారులు మృతి చెందిన నేపథ్యంలో తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆసుపత్రిని సందర్శించారు. ప్రమాదం చోటుచేసుకున్న నవజాత శిశువుల ప్రత్యేక సంరక్షణ విభాగం (ఎస్ఎన్‌సీయూ)ను పరిశీలించి అధికారుల నుంచి వివరాలు

మిగతా 2 లో..

# పల్లె ప్రజలకు ఆయుర్వేదం చేరాలి

- **జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ఉచిత శిబిరం**
- **ములుగు ఆసుపత్రిలో కార్యక్రమాన్ని ప్రారంభించిన సీతక్క**
- **ఏటూరునాగారం ఆసుపత్రి అభివృద్ధికి చర్యలు**
- **ప్రజలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం**




**ములుగు, సెప్టెంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు)**

ఆయుర్వేద వైద్య సేవలను పల్లె ప్రజలకు మరింత చేరువ చేయాల్సిన అవసరం ఉందని మంత్రి సీతక్క అన్నారు. 11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా బుధవారం ములుగు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్య విధానం ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. ఆయుర్వేదం భారతీయ సంప్రదాయ వైద్య విధానమని, సహజ చికిత్సా విధానాల

మిగతా 2 లో..



## సికింద్రాబాద్ మెట్రోలో భద్రతా మాక్ డ్రిల్

- **అత్యవసర పరిస్థితులపై సన్నద్ధత పరీక్ష**
- **స్టేషన్ పరిసరాల్లో తనిఖీలు నిర్వహణ**
- **భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు**

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 23**
**(తెలంగాణ ముచ్చట్లు)**

ప్రయాణికుల భద్రతను మరింత బలోపేతం చేయడం, అత్యవసర పరిస్థితుల్లో స్పందన సామర్థ్యాన్ని అంచనా వేయడం లక్ష్యంగా సికింద్రాబాద్ ఈస్ట్ మెట్రో స్టేషన్‌లో బుధవారం ఉదయం భద్రతా మాక్ డ్రిల్ నిర్వహించారు. భద్రతా సిబ్బంది,

మిగతా 2 లో..



## విద్యుత్ అంశంపై బీఆర్ఎస్‌పై విమర్శలు

- **రైతుల పేరుతో రాజకీయాలు చేస్తున్నారని వ్యాఖ్య**
- **విద్యుత్ ప్రాజెక్టుల్లో అవకతవకలు జరిగాయని ఆరోపణ**
- **చామల కిరణ్ కుమార్ రెడ్డి**

2 లో..

# సేవా సంకల్ప్‌లో మెగా రక్తదాన శిబిరం

- **నాగోల్‌లో బీజేవైయం ఆధ్వర్యంలో కార్యక్రమం**
- **పాల్గొన్న ఎంపీ ఈటెల రాజేందర్**
- **మోదీ ప్రజా జీవితానికి 25 ఏళ్లు పూర్తి**
- **రక్తదాతలకు కృతజ్ఞతలు తెలిపిన నేతలు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 23**
**తెలంగాణ ముచ్చట్లు)**

ప్రధాని నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న "సేవా సంకల్ప్ అభియాన్" కార్యక్రమాల్లో భాగంగా నాగోల్‌లో భారతీయ జనతా యువ మోర్చా ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఈటెల రాజేందర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) చంద్రశేఖర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఈటెల రాజేందర్, గుజరాత్ ముఖ్యమంత్రిగా, అనంతరం దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ అందించిన సేవలను ప్రస్తావించారు.

మిగతా 2 లో..






## మారేళ్లపాడు పథకానికి
# జలాల శ్రీకారం

- **మంత్రులు తుమ్మల, పొంగులేటి చేతుల మీదుగా ప్రారంభం**
- **సాగునీటి విస్తరణకు భారీ ప్రణాళికలు**
- **వేలాది ఎకరాలకు నీరందించే లక్ష్యంతో చర్యలు**

**అశ్వాపురం, సెప్టెంబర్ 23**
**(తెలంగాణ ముచ్చట్లు)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వాపురం మండలం మారేళ్లపాడులో సుమారు రూ.610 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన ఎత్తిపోతల పథకాన్ని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. పంపులను ప్రారంభించి గోదావరి జలాలను తుమ్మల చెరువుకు విడుదల చేశారు. దీంతో ఈ ప్రాంత రైతులకు సాగునీటి కల సాకారం దిశగా మరో కీలక అడుగు పడింది. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ మారేళ్లపాడు ఎత్తిపోతల పథకం ద్వారా తొలి విడతలో 4,300 ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. దశలవారీగా అశ్వాపురం మండల పరిధిలో 22 నుంచి 23 వేల ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రణాళికలు రూపొందించినట్లు వెల్లడించారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటిపారుదల రంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా జిల్లాతో పాటు పలు నియోజకవర్గాల్లో సాగునీటి విస్తరణకు చర్యలు చేపడుతున్నట్లు మంత్రులు తెలిపారు. గోదావరి జలాలను

మిగతా 2 లో..

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ప్రపంచ పెట్టుబడుల గమ్యంగా తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారులను ఆకర్షించే విధంగా విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. వివిధ దేశాలు, ప్రధాన నగరాల్లో రోడ్‌షోలు నిర్వహించి తెలంగాణలో ఉన్న పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పాలని అధికారులను ఆదేశించారు. పారిశ్రామిక, సాంకేతిక, మౌలిక సదుపాయాలు, నైపుణ్య వనరుల పరంగా తెలంగాణకు ఉన్న ప్రత్యేకతలను సదస్సులో ప్రతిష్ఠాత్మకంగా ప్రదర్శించాలని సూచించారు. రాష్ట్రానికి భారీ స్థాయిలో పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు తీసుకురావడమే ప్రధాన లక్ష్యంగా కార్యాచరణ రూపొందించాలని పేర్కొన్నారు. పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణాన్ని మరింత బలోపేతం చేయాలని తెలిపారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్య సాధనలో ఈ గ్లోబల్ సమ్మిట్ కీలక మైలురాయిగా నిలవాలని భట్టి విక్రమార్క అభిప్రాయపడ్డారు. దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికలకు అనుగుణంగా పెట్టుబడులను ఆకర్షించి రాష్ట్ర ఆర్థిక పురోగతిని వేగవంతం చేయాలని సూచించారు. సదస్సు ఏర్పాట్లలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. ప్రత్యేక వార్‌రూమ్ ఏర్పాటు చేసి ప్రతి అంశాన్ని నిరంతరం పర్యవేక్షించాలని, నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని సూచించారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026ను విజయవంతం చేసి రాష్ట్ర ప్రతిష్ఠను మరింత పెంచాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# సైనియోస్ హెల్త్‌కు హైదరాబాద్‌లో నూతన కేంద్రం

(మొదటి పేజీ తరువాయి)

డేటా విశ్లేషణ, కృత్రిమ మేధ, సాంకేతిక రంగాలను నగరానికి తీసుకువస్తున్నాయని చెప్పారు. ఆరోగ్య రంగంలో తదుపరి విప్లవానికి హైదరాబాద్ వేదికగా మారుతోందన్నారు.
సైనియోస్ హెల్త్ ఏర్పాటు చేసిన ఈ కేంద్రం సుమారు 1.37 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించబడిందని మంత్రి తెలిపారు. ఇది ఆసియాలో సంస్థకు అతిపెద్ద కేంద్రం కాగా ప్రపంచవ్యాప్తంగా మూడవ అతిపెద్ద కేంద్రంగా నిలుస్తోందన్నారు. క్లినికల్ అభివృద్ధి, జీవ ఔషధ నైపుణ్యం, కృత్రిమ మేధ, డేటా మరియు సాంకేతిక సామర్థ్యాలను ఒకే వేదికపైకి తీసుకురావడం ఈ కేంద్రం ప్రత్యేకతగా పేర్కొన్నారు. ఈ కేంద్రం ద్వారా హైదరాబాద్‌లోని నిపుణులు ప్రపంచవ్యాప్తంగా ఔషధ అభివృద్ధి కార్యక్రమాలకు మద్దతు అందించనున్నారని మంత్రి వివరించారు. సైనియోస్ హెల్త్ చేరికతో ప్రపంచంలోని అగ్రశ్రేణి క్లినికల్ పరిశోధన సంస్థల్లో నాలుగు సంస్థలు హైదరాబాద్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. దీనివల్ల ప్రపంచ జీవ విజ్ఞాన రంగంలో నగర ప్రాధాన్యం మరింత పెరిగిందన్నారు. హైదరాబాద్‌ను కృత్రిమ మేధ ఆధారిత జీవ విజ్ఞాన రంగానికి ప్రపంచ పరీక్షా వేదికగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. పరిశోధన సంస్థలు, పరిశ్రమలు, సాంకేతిక నిపుణులు కలిసి పనిచేసే వాతావరణాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. ప్రయోగశాలల నుంచి పరిశ్రమల వరకు పరిశోధన ఫలితాలు వేగంగా చేరే విధానాన్ని ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. సైనియోస్ హెల్త్ సంస్థ హైదరాబాద్‌లో ప్రత్యేక నైపుణ్యాలను అభివృద్ధి చేయడంతో పాటు అధునాతన సాంకేతిక సామర్థ్యాలను విస్తరించాలని మంత్రి ఆకాంక్షించారు. ప్రపంచవ్యాప్తంగా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించే పరిశోధనలకు హైదరాబాద్ కేంద్రంగా నిలవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణను ప్రపంచ జీవ విజ్ఞాన, సాంకేతిక రంగాల్లో అగ్రగామిగా నిలపడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

# పల్లె ప్రజలకు ఆయుర్వేదం చేరాలి

(మొదటి పేజీ తరువాయి)

ద్వారా ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తోందని మంత్రి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. ఆరోగ్య పరిరక్షణలో నివారణకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం ఆయుర్వేద ప్రత్యేకత అని వివరించారు.
ఏటూరునాగారం ఆయుర్వేద ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ఆసుపత్రిలో మౌలిక సదుపాయాల మెరుగుదలతో పాటు వైద్య సేవల విస్తరణకు కృషి చేస్తామని చెప్పారు. ప్రజలకు మెరుగైన చికిత్స అందేలా అవసరమైన వనరులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఉచిత ఆరోగ్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సలహాలు అందించారు. వివిధ రకాల ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించడంతో పాటు ఆయుర్వేద చికిత్సా విధానాల గురించి వివరించారు. శిబిరానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై సేవలను వినియోగించుకున్నారు.
జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆరోగ్య శిబిరాలు ప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా సంప్రదాయ వైద్య విధానాలపై ప్రజల్లో మరింత అవగాహన పెరిగిందని అధికారులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆయుర్వేద సేవలను విస్తరించేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలు ప్రజలకు మరింత ప్రయోజనం చేకూరుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# విద్యుత్ అంశంపై బీఆర్‌ఎస్‌పై విమర్శలు

**భువనగిరి, సెప్టెంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు)** భువనగిరి లోక్‌సభ సభ్యుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి బీఆర్‌ఎస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. విద్యుత్ అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. విద్యుత్ ఛార్జీలు, రైతుల సమస్యల పేరుతో బీఆర్‌ఎస్ నాయకులు చేస్తున్న ప్రచారంలో వాస్తవాలు లేవని పేర్కొన్నారు. కేటీఆర్ విద్యుత్ అంశంపై చేస్తున్న వ్యాఖ్యలు చరిత్రకు విరుద్ధంగా ఉన్నాయని అన్నారు. కేసీఆర్ విద్యుత్ ఉద్యమాల పేరుతో చెప్పే విషయాలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయని చామల కిరణ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. 2000 సంవత్సరంలో బషీర్‌బాగ్ ఘటన జరిగిన సమయంలో కేసీఆర్ తెలుగుదేశం పార్టీలోనే ఉన్నారని, 2001లో మంత్రి పదవి రాకపోవడం వల్లే పార్టీని వీడారని చెప్పారు. రైతులకు ఉచిత విద్యుత్ అందించిన



ఘనత కాంగ్రెస్ పార్టీదేనని పేర్కొన్నారు. ఆ చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలు ప్రజలు నమ్మరని అన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో విద్యుత్ సంస్థలు భారీ అప్పుల పాలయ్యాయని ఆరోపించారు. డిస్కంలపై లక్షల కోట్ల రూపాయల ఆర్థిక భారం పడిందని, విద్యుత్ కొనుగోళ్లలో పారదర్శకత లోపించిందని విమర్శించారు. ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్ కొనుగోలు ఒప్పందాల్లో అవకతవకలు జరిగాయని, ఇతర రాష్ట్రాల నుంచి తక్కువ ధరకు విద్యుత్ లభించే అవకాశాలు ఉన్నప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఈ వ్యవహారాలపై పూర్తి వివరాలు ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. భద్రాద్రి, యాదాద్రి విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణాల్లోనూ భారీ అక్రమాలు జరిగాయని చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో సాంకేతిక ఎంపికల కారణంగా ప్రభుత్వానికి నష్టం వాటిల్లిందని అన్నారు. యాదాద్రి ప్రాజెక్టు కాంట్రాక్టుల కేటాయింపులో కూడా పారదర్శకత పాటించలేదని విమర్శించారు. ప్రాజెక్టుల పేరుతో జరిగిన ప్రతి అంశంపై తమ వద్ద పూర్తి సమాచారం ఉందని, అవసరమైతే ప్రజల ముందుకు తీసుకొస్తామని హెచ్చరించారు. ఎల్‌నినో ప్రభావంపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న సమయంలో రైతులకు సరైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఎంపీ పేర్కొన్నారు. వరి పంటలపై మాత్రమే ఆధారపడకుండా ఇతర ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి పెట్టేలా ప్రభుత్వం సూచనలు చేస్తోందని చెప్పారు. అయితే బీఆర్‌ఎస్ మాత్రం రైతులను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందని ఆరోపించారు. ప్రకృతి పరిస్థితులను రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించడం బాధ్యతారాహిత్యమని అన్నారు. రైతులు, ప్రజలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అంశాలపై ఒక్కొక్కటిగా వాస్తవాలు బయటపెడతామని, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను ప్రజలే తిప్పికొడతారని అన్నారు. రాష్ట్రాన్ని అప్పుల భారం నుంచి బయటకు తీసుకురావడమే ప్రస్తుత ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

# మారేళ్లపాడు పథకానికి జలాల శ్రీకారం





(మొదటి పేజీ తరువాయి)

వ్యవసాయానికి సమర్థంగా వినియోగించి రైతుల ఆదాయాన్ని పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. సాగునీటి వసతుల విస్తరణతో వ్యవసాయ రంగం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ మారేళ్లపాడు పథకంతో పాటు జిల్లాలో సుమారు 16 వేల ఎకరాలకు సాగునీరు అందించే పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఎనిమిది మండలాల్లో సీతారామ ఎత్తిపోతల పథకానికి సంబంధించిన డిస్ట్రిబ్యూటరీల సర్వే దాదాపు 60 శాతం పూర్తయిందని చెప్పారు. సీతమ్మ సాగర్ ప్రాజెక్టుకు సంబంధించి సుమారు 600 ఎకరాల భూసేకరణ పూర్తయి అవార్డు దశలో ఉందని వెల్లడించారు.
భూసేకరణ, సర్వేలు, అనుమతులు, డిస్ట్రిబ్యూటరీల నిర్మాణ పనులను సమన్వయంతో పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ తెలిపారు. భూసేకరణ కోసం ప్రభుత్వం సుమారు రూ.46 కోట్ల నిధులను విడుదల చేసిందని చెప్పారు. సాగునీటి ప్రాజెక్టుల అమలులో వేగం పెంచేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని వివరించారు. పులుసుబొంత ప్రాజెక్టుకు అవసరమైన పరిహార అటవీకరణ భూముల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. యటాలకుంట, నాగుపల్లి, దమ్మపేట తదితర ప్రాంతాల్లో కూడా పనులను వేగవంతం చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, సర్పంచులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని ప్రాజెక్టు ప్రారంభాన్ని స్వాగతించారు.



# రిమ్స్ ఘటనపై కవిత విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చిన్నారుల మరణాలు అత్యంత బాధాకరమని పేర్కొన్న కవిత, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తక్షణ సహాయం అందించాలని కోరారు. ప్రతి కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో చోటుచేసుకున్న పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. రిమ్స్ ఆసుపత్రిలో వైద్య సిబ్బంది, నర్సులు, సాంకేతిక సిబ్బంది కొరత ఉందని ఆమె ఆరోపించారు. అవసరమైన స్థాయిలో వైద్యులు, ఇతర సిబ్బంది లేకపోవడం వల్ల సేవలపై ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ బకాయిలు, మౌలిక సదుపాయాల సమస్యలు, పరికరాల నిర్వహణలో లోపాలపై కూడా ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతాల నుంచి రిమ్స్ ఆసుపత్రికి చేరుకునేందుకు సరైన రహదారులు లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కవిత అన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో ఆరోగ్య సేవల మెరుగుదలకు ప్రత్యేక చర్యలు అవసరమని పేర్కొన్నారు. పెండింగ్ బిల్లులు విడుదల చేయడంతో పాటు మౌలిక సదుపాయాలను బలోపేతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలోని ఇతర ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ మౌలిక వసతుల పరిస్థితిపై సమగ్ర సమీక్ష అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో భద్రత, పరికరాల నిర్వహణ, అగ్నిమాపక వ్యవస్థలపై ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ఆరోగ్య రంగానికి మరింత ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఆదిలాబాద్ జిల్లాలో శిశువుల మరణాలు, గర్భిణుల ఆరోగ్యం, వైద్య సేవల పరిస్థితిపై అధ్యయనం చేసేందుకు పార్టీ తరపున ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు కవిత ప్రకటించారు. కమిటీ సమగ్ర నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేస్తుందని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజలతో కలిసి పోరాటం కొనసాగిస్తామని, ఆరోగ్య సేవల మెరుగుదల కోసం కృషి చేస్తామని స్పష్టం చేశారు.

# సికింద్రాబాద్ మెట్రోలో భద్రతా మాక్ డ్రిల్

(మొదటి పేజీ తరువాయి)

పోలీసు అధికారులు, సంబంధిత విభాగాల సమన్వయంతో ఈ విన్యాసం చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా తక్షణ చర్యలు తీసుకునే విధానాలను ఈ సందర్భంగా పరిశీలించారు. మాక్ డ్రిల్‌లో భాగంగా మెట్రో స్టేషన్ ఆవరణతో పాటు పరిసర ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికుల రాకపోకలు జరిగే ప్రాంతాలు, ప్రవేశ ద్వారాలు, నిరీక్షణ ప్రదేశాలు, భద్రతా తనిఖీ కేంద్రాలను పరిశీలించి భద్రతా ప్రమాణాలను సమీక్షించారు. అనుమానాస్పద వస్తువులు లేదా పరిస్థితులను గుర్తించే విధానాలపై సిబ్బందికి సూచనలు అందించారు.
అత్యవసర పరిస్థితుల్లో వివిధ శాఖల మధ్య సమన్వయం ఎంత సమర్థంగా ఉందో అంచనా వేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రమాదకర పరిస్థితి తలెత్తిన సందర్భంలో ప్రయాణికులను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, ప్రాంతాన్ని నియంత్రణలోకి తీసుకోవడం, సహాయక చర్యలు చేపట్టడం వంటి అంశాలపై విన్యాసాలు నిర్వహించారు. స్పందన సమయాన్ని కూడా అధికారులు పరిశీలించారు. స్టేషన్‌లో అమలవుతున్న భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, భద్రతా తనిఖీ వ్యవస్థల పనితీరును సమీక్షించారు. ప్రయాణికుల భద్రతకు సంబంధించిన అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైన చోట మెరుగుదల చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రజల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని స్పష్టం చేశారు.
మెట్రో సేవలను వినియోగించే వేలాది మంది ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని తరచూ ఇలాంటి మాక్ డ్రిల్లులు నిర్వహించడం అవసరమని అధికారులు తెలిపారు. అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించేలా శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. భద్రతా ప్రమాణాలను మరింత పటిష్ఠం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రజలు కూడా భద్రతా అంశాలపై అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అనుమానాస్పద వస్తువులు, వ్యక్తులు లేదా ఘటనలు గమనించిన వెంటనే భద్రతా సిబ్బందికి సమాచారం ఇవ్వాలని కోరారు. మెట్రో ప్రయాణాన్ని మరింత సురక్షితంగా, సౌకర్యవంతంగా మార్చేందుకు పోలీసు శాఖ, మెట్రో అధికారులు సంయుక్తంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు.

# సేవా సంకల్ప్‌లో మెగా రక్తదాన శిబిరం

(మొదటి పేజీ తరువాయి)

ప్రజా జీవితంలో 25 సంవత్సరాల పాటు వివిధ బాధ్యతల్లో కొనసాగుతూ దేశాభివృద్ధికి కృషి చేశారని పేర్కొన్నారు. దేశ ప్రజలు కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతంగా ఆయన సేవలను గుర్తిస్తున్నారని అన్నారు.
ప్రపంచ వేదికపై భారతదేశ ప్రతిష్ఠను పెంచడంలో మోదీ పాత్ర కీలకమని ఈటెల రాజేందర్ పేర్కొన్నారు. రైల్వేలు, విమానాశ్రయాలు, జాతీయ రహదారులు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. దేశ ఆర్థికాభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణలో గత కొన్నేళ్లుగా భారీ పెట్టుబడులు పెట్టిన విషయాన్ని ప్రస్తావించారు. ప్రధాని ఎప్పుడూ తనను పాలకుడిగా కాకుండా ప్రజాసేవకుడిగా భావిస్తారని ఈటెల రాజేందర్ అన్నారు. నిరంతరం ప్రజాసేవలో నిమగ్నమై దేశాభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఆయురారోగ్యాలతో మరిన్ని సంవత్సరాలు ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు.
రక్తదాన శిబిరంలో పెద్ద సంఖ్యలో యువకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సమాజసేవలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమం విజయవంతంగా సాగిందని నిర్వాహకులు తెలిపారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ ఈటెల రాజేందర్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసం వెంకటేశ్వర్లు, బండ కార్తీక, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎన్. గౌతం రావు, తుళ్ల వీరేందర్ గౌడ్, బీజేవైయం రాష్ట్ర అధ్యక్షుడు కుండె గణేష్, రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక


# కరీంనగర్‌లో ఘనంగా గణేష్ నిమజ్జనోత్సవం



- **కొత్తపల్లి నూతన నిమజ్జన పాయింట్‌ను ప్రారంభించిన మేయర్ కొలగాని శ్రీనివాస్**

**కరీంనగర్, సెప్టెంబర్ 23(తెలంగాణ ముచ్చట్లు ):** తొమ్మిది రోజుల పాటు భక్తుల పూజలు, భజనలు, విశేష అభిషేకాలతో కొలువుదీరిన గణనాథుడు గంగమ్మ ఒడికి చేరాడు. కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొత్తపల్లి నూతన గణేష్ నిమజ్జన పాయింట్‌లో నిమజ్జనోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా ప్రారంభమయ్యాయి. నూతన నిమజ్జన పాయింట్‌ను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం శోభాయాత్రగా తరలివచ్చిన తొలి గణేష్ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల జయజయధ్వానాల మధ్య క్రేన్ సహాయంతో గణేష్ విగ్రహాన్ని నిమజ్జనం చేసి విఘ్నేశ్వరుడికి భక్తిశ్రద్ధలతో వీడ్కోలు పలికారు. నగరంలో నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో జరిగేలా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు.

# జాషువా సాహిత్యం సామాజిక చైతన్యానికి స్ఫూర్తి

- **మరకంటి నరసింహకు జాషువా సాహిత్య పురస్కారం**



**వనపర్తి,సెప్టెంబర్23(తెలంగాణ ముచ్చట్లు):** మహాకవి గుర్రం జాషువా తన కవిత్వంతో తెలుగు సమాజంలో సామాజిక చైతన్యాన్ని రగిలించారని సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు. జాషువా 131వ జయంతి వేడుకలను ఈ నెల 29న మంగళవారం సాయంత్రం 5 గంటలకు వనపర్తి పట్టణంలోని ఎం.ఎన్.ఆర్. బ్యాంకెట్ హాల్‌లో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.కార్యక్రమానికి ప్రముఖ సాహితీవేత్త ఆచార్య కోయి కోటేశ్వర్ రావు ప్రధాన వక్తగా హాజరుకానుండగా, ముఖ్య అతిథిగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, ఆత్మీయ అతిథులుగా మాజీ రాజ్యసభ సభ్యుడు రావుల చంద్రశేఖర్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొననున్నారు.ఈ సందర్భంగా వనపర్తికి చెందిన ప్రముఖ వచన కవి మరకంటి నరసింహకు 'గుర్రం జాషువా సాహిత్య పురస్కారం'ను ప్రదానం చేయనున్నట్లు శంకర్ గౌడ్ వెల్లడించారు.జాషువా రచనలు నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాయని, ఆయన సాహిత్యంలో ప్రతిబింబించిన సామాజిక చైతన్యం తరతరాలకు స్ఫూర్తినిస్తుందని అన్నారు. జయంతి వేడుకలకు జిల్లాలోని కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# జర్నలిస్టుల సమస్యలపై సమిష్టి పోరాటం

- **రవికుమార్, తెలంగాణ జర్నలిస్టుల జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా అధ్యక్షులు**



**వనపర్తి,సెప్టెంబర్23(తెలంగాణ ముచ్చట్లు):** జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం యూనియన్ భేదాలను పక్కనపెట్టి సమిష్టిగా పోరాడాల్సిన అవసరం ఉందని తెలంగాణ జర్నలిస్టుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) వనపర్తి జిల్లా అధ్యక్షుడు రవికుమార్ అన్నారు. జేఏసీ అన్ని జర్నలిస్టు యూనియన్లకు అతీతంగా పనిచేస్తుందని తెలిపారు.జేఏసీ వనపర్తి జిల్లా అధ్యక్షుడిగా రవికుమార్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు తోగరి కరుణాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల గణేష్ ప్రకటించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ జేఏసీ ఏ ఒక్క యూనియన్‌కు పోటీగా, ప్రత్యామ్నాయంగా కాదని, జర్నలిస్టుల ఉమ్మడి సమస్యల పరిష్కారం కోసం పనిచేసే సమన్వయ వేదిక అని పేర్కొన్నారు.జర్నలిస్టుల అక్రిడిటేషన్, హెల్త్ కార్డులు, ప్రమాద బీమా, ఇళ్ల స్థలాలు, బస్‌పాస్‌లు, వృద్ధాప్య భద్రత, ఉద్యోగ భద్రత తదితర సమస్యలపై సమిష్టిగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. వ్యక్తిగత, సంస్థాగత, యూనియన్ భేదాలకు అతీతంగా జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం అందరినీ కలుపుకొని ముందుకు సాగుతామని తెలిపారు.వనపర్తి జిల్లాలోని 15 మండలాలతో పాటు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యలను గుర్తించి, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని రవికుమార్ చెప్పారు. జర్నలిస్టుల సమస్యలపై ఐక్యంగా నిలిస్తేనే బలమైన గొంతు వినిపించగలమన్నారు.అన్ని జర్నలిస్టు సంఘాలు, యూనియన్లు, వివిధ మీడియా సంస్థల్లో పనిచేస్తున్న జర్నలిస్టులు సమిష్టిగా ముందుకు వచ్చి హక్కులు, సంక్షేమం కోసం కృషి చేయాలని రవికుమార్ పిలుపునిచ్చారు. ఎవరు ఏ యూనియన్‌లో ఉన్నారన్నది కాదు.. జర్నలిస్టు సమస్యను ఎదుర్కొంటున్నాడా లేదా అన్నదే జేఏసీకి ముఖ్యం అని ఆయన స్పష్టం చేశారు.

# మంగంపల్లిలో కబడ్డీ సందడి

- **ఎస్‌జీఎఫ్ అండర్-17 పోటీల్లో 15 మండలాల జట్లు**



**పెద్దమందడి,సెప్టెంబర్23(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మంగంపల్లి గ్రామంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్17 కబడ్డీ పోటీలు ఉత్సాహభరితంగా నిర్వహించారు. వనపర్తి జిల్లా పరిధిలోని 15 మండలాలకు చెందిన బాలబాలికల జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి.అమరచింత, ఆత్మకూర్, చిన్నంబావి, ఘణపూర్, గోపాల్‌పేట, కొత్తకోట, పానగల్, పెబ్బేరు, పెద్దమందడి, మదనాపూర్, రేవల్లి, వనపర్తి, వీపనగండ్ల, శ్రీరంగాపూర్, ఏదుల మండలాల జట్లు పోటీల్లో తలపడ్డాయి. విద్యార్థులు ప్రతిభను చాటుకుంటూ హోరాహోరీగా పోటీ పడ్డారు. ఖిల్లా ఘణపూర్ మండల పీఈటీ చిట్టెమ్మ సమన్వయంతో పోటీలు నిర్వహించారు. ఆయా మండలాలకు చెందిన పీడీలు, క్రీడా ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గనిర్దేశం చేస్తూ పోటీలను పర్యవేక్షించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. పాఠశాల స్థాయిలో నిర్వహించే క్రీడా పోటీల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తుందని పేర్కొన్నారు. కబడ్డీ వంటి జట్టు క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి, సమన్వయం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. మంగంపల్లి వేదికగా నిర్వహించిన ఈ పోటీలు జిల్లాలో పాఠశాల స్థాయి క్రీడలకు ప్రోత్సాహం అందించడంతో పాటు భవిష్యత్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు దోహదపడతాయని అన్నారు.కార్యక్రమంలో డీవైఎస్ఓ సుధీర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ ఇన్‌చార్జి కుమార్, స్థానిక సర్పంచ్ రమేష్‌నాయక్, గ్రామ పెద్ద వెంకటరామిరెడ్డి, మండలాధ్యక్షుడు కొమ్ము వెంకటస్వామి, మాజీ ఎంపీపీ రఘు ప్రసాద్, వనపర్తి మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, ఎంపీడీవో పరిణితి, రాఘవేందర్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, 15 మండలాల పీడీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధల మధ్య నగరపాలక సంస్థ గణనాథుడి నిమజ్జన శోభాయాత్ర





- **వేదమంత్రోచ్ఛారణలు, మంగళహారతుల నడుమ ఘనంగా వీడ్కోలు**
- **మేయర్ కొలగాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైభవంగా నిమజ్జన వేడుకలు**

**కరీంనగర్, సెప్టెంబర్ 23(తెలంగాణ ముచ్చట్లు ):** కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రతిష్ఠించిన గణనాథుడికి బుధవారం భక్తిశ్రద్ధలతో చివరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు విశేష పూజలు, అభిషేకాలతో కొలిచిన వినాయకుడికి వేదమంత్రోచ్చారణలు, మంగళహారతుల మధ్య ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గణనాథుడి విగ్రహాన్ని కదిలించి నిమజ్జన శోభాయాత్రను ప్రారంభించారు. వేదమంత్రాల నడుమ ప్రారంభమైన శోభాయాత్ర భక్తుల సందడి, జై గణేశ్ నినాదాలతో వైభవంగా సాగింది. నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు. అనంతరం స్వామివారి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు.

# బోర్నపల్లిలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు

- **అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి పదవులపై శుక్రవారం తుది నిర్ణయం**



**హుజురాబాద్,సెప్టెంబర్ 23(తెలంగాణ ముచ్చట్లు ):** గ్రామంలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. సంఘంలోని అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి తదితర కీలక పదవులకు సంబంధించి ఎన్నికలు జరిగాయి. ఎన్నికల ప్రక్రియ పూర్తయినప్పటికీ, ఏ పదవికి ఎవరు బాధ్యతలు చేపట్టాలనే అంశంపై శుక్రవారం తుది నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

ఎన్నికల అనంతరం నూతన పాలకవర్గం ఏర్పడనుండటంతో సంఘ సభ్యుల్లో ఆసక్తి నెలకొంది. కొత్తగా బాధ్యతలు చేపట్టే ప్రతినిధులు సంఘం అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని సభ్యులు, స్థానిక ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. ముఖ్యంగా మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరుతున్నారు.

మత్స్యకారులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, రాయితీలు, వలలు, పరికరాలు, బీమా, ఆర్థిక సహాయం వంటి ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా నూతన పాలకవర్గం చర్యలు తీసుకోవాలని స్థానికులు సూచిస్తున్నారు. ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుని పథకాల అమలులో పారదర్శకత పాటించాలని వారు కోరుతున్నారు.

సంఘంలోని ప్రతి సభ్యుడికి అవసరమైన సమయంలో సహాయ సహకారాలు అందిస్తూ, మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధికి తోడ్పడే విధంగా సంఘాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత నూతన పాలకవర్గంపై ఉందని సభ్యులు పేర్కొంటున్నారు. మత్స్య ఉత్పత్తులకు సరైన మార్కెట్ కల్పించడం, విక్రయాల్లో మధ్యవర్తుల ప్రభావాన్ని తగ్గించడం, సభ్యులకు శిక్షణ, రుణ సదుపాయాలు కల్పించడం వంటి అంశాలపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

పదవులు ఎవరు చేపట్టినా వ్యక్తిగత ప్రయోజనాలకు కాకుండా సంఘం ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పనిచేయాలని, సభ్యులందరినీ కలుపుకుని సమన్వయంతో ముందుకు సాగాలని ప్రజలు సూచిస్తున్నారు. సంఘంలో ఐక్యతను కాపాడుతూ, నిర్ణయాలను సభ్యుల అభిప్రాయాలతో తీసుకోవాలని వారు అభిప్రాయపడుతున్నారు. మత్స్యకారుల సంక్షేమం, సంఘం బలోపేతం, సభ్యుల సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పథకాల సమర్థవంతమైన అమలు ప్రధాన లక్ష్యాలుగా నూతన పాలకవర్గం పనిచేస్తే బోర్నపల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం మరింత అభివృద్ధి చెందుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం వెలువడే తుది నిర్ణయంతో సంఘం భవిష్యత్ కార్యాచరణపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# మృతుల కుటుంబాలకు మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శ

- **కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా**



**సైదాపూర్ : సెప్టెంబర్ 23(తెలంగాణ ముచ్చట్లు ):** హుస్నాబాద్ నియోజకవర్గంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించారు. ఈ సందర్భంగా సైదాపూర్ మండలంలో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబాలను ఆయన పరామర్శించి, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.సైదాపూర్ మండలం దుద్దెనపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన కుందేళ్ల కనకమ్మ, అప్పిడి సుభద్ర, బోరగల్ల పోచమ్మ కుటుంబాలను మంత్రి పొన్నం ప్రభాకర్ వారి నివాసాలకు వెళ్లి పరామర్శించారు. అనంతరం సైదాపూర్‌లో అనగోని రవీందర్ గౌడ్, మొలగూరి వసంత కుటుంబాలను, సోమారం గ్రామంలో కోల లావణ్య, బూడిద వీరమ్మ కుటుంబాలను పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయా కుటుంబ సభ్యులతో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడి వారి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి, వారి దుఃఖంలో ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని, అవసరమైన సమయంలో అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కష్టకాలంలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.ఈ పర్యటనలో సైదాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చాడ కొండల్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ దొంత సుధాకర్, జిల్లా సీనియర్ నాయకులు గుండారపు శ్రీనివాస్, ఆయా గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ, సొసైటీ డైరెక్టర్లు, పార్టీ సీనియర్ నాయకులు, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు, యూత్ నాయకులు, ఎన్ఎస్‌యుఐ , ఎస్సీ సెల్, ఎస్టీ సెల్, బీసీ సెల్, మైనారిటీ సెల్, కిసాన్ సెల్ అధ్యక్షులు, సోషల్ మీడియా విభాగం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# హుజురాబాద్‌లో ఘనంగా వినాయక నిమజ్జనం



- తొలి నిమజ్జనాన్ని ప్రారంభించిన చైర్‌పర్సన్ సుహాసిని

**హుజురాబాద్, సెప్టెంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు ):** హుజురాబాద్ పట్టణంలో వినాయక నిమజ్జన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలో తొలి వినాయక విగ్రహ నిమజ్జన కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి రొంటాల సుహాసిని మనోజ్‌రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిషన్, పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.వినాయక నవరాత్రి ఉత్సవాల అనంతరం భక్తులు గణనాథుడికి ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై వినాయక విగ్రహాలను తరలిస్తూ భక్తులు "గణపతి బప్పా మోరియా" అంటూ నినాదాలు చేశారు. యువత, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో గణనాథుడికి వీడ్కోలు పలికారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ట్రాఫిక్ నియంత్రణతో పాటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పర్యవేక్షించారు. మున్సిపల్ సిబ్బంది నిమజ్జన ప్రాంతాల్లో పారిశుద్ధ్య ఏర్పాట్లు చేపట్టి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు. మున్సిపల్ అధికారులు, పోలీస్ శాఖ సమన్వయంతో నిమజ్జన కార్యక్రమాలు సజావుగా కొనసాగుతున్నాయి. పట్టణంలో మిగిలిన వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలు కూడా ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేసారు.

# కడియంకు రాజకీయ పునర్జన్మ ఇచ్చింది కేసీఆర్



- మున్సిపాలిటీ అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- కడియం శ్రీహరిపై బీఆర్ఎస్ నాయకుల విమర్శలు

**స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు):** స్టేషన్ ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై బీఆర్ఎస్ నాయకులు తీవ్ర విమర్శలు చేశారు. తాటికొండ రాజయ్యపై కడియం శ్రీహరి చేసిన వ్యాఖ్యలకు వారు కౌంటర్ ఇచ్చారు.తాటికొండ రాజయ్య నిస్వార్థంగా రాజకీయాల్లో పనిచేశారని, ఆయన కుటుంబ సభ్యులు వైద్యులు అయినప్పటికీ సొంత ఆస్పత్రి ఏర్పాటు చేసుకోలేదని నాయకులు పేర్కొన్నారు. కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఏర్పాటుకు రాజయ్య ఉప ముఖ్యమంత్రి పదవిని త్యాగం చేశారని తెలిపారు.కడియం శ్రీహరికి రాజకీయ పునర్జన్మ ఇచ్చింది కేసీఆర్ అని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. బీఆర్ఎస్ బీఫారంపై ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం రాజీనామా చేయకుండా కాంగ్రెస్‌లో చేరి, తన కుమార్తె రాజకీయ భవిష్యత్తు కోసం ఆమెను ఎంపీగా గెలిపించుకున్నారని విమర్శించారు.గతంలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంజూరు చేయించిన సాగునీటి పనులకు తిరిగి అంచనాలు రూపొందించి, తానే పనులు మంజూరు చేయించానని చెప్పడం హాస్యాస్పదమని అన్నారు. 2004లో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఒక్క జలాశయం కూడా ఉందా అని ప్రశ్నించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జలాశయాలకు పునాదులు వేస్తే, ఎమ్మెల్యేగా తాటికొండ రాజయ్య ఏడు జలాశయాలను ప్రారంభించారని తెలిపారు.2004 నుంచి 2023 వరకు ఘన్‌పూర్ నియోజకవర్గ ప్రజలు కడియం శ్రీహరిని మర్చిపోయారనే విషయాన్ని గుర్తు చేశారు. ప్రతిపక్షాలు అభివృద్ధిపై విమర్శలు చేస్తే వాటికి సమాధానం చెప్పాల్సింది పోయి వ్యక్తిగత విమర్శలకు దిగడం తగదన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన జీవో 97ను రద్దు చేయించాలని కడియం శ్రీహరికి సవాల్ విసిరారు. స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీకి రూ.50 కోట్ల నిధులు మంజూరు చేయించానని చెప్పడం కాకుండా ప్రతి వార్డులో వార్డు సభ్యులతో కలిసి పర్యటించి, ప్రజల సమస్యలను తెలుసుకుని అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. మున్సిపాలిటీలో ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి పనులు, ఖర్చు చేసిన నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.మరోసారి రెండో శ్రేణి నాయకులతో మీడియా సమావేశాలు ఏర్పాటు చేసి తమ నాయకుడు తాటికొండ రాజయ్యపై విమర్శలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. రాజయ్య జోలికి వస్తే తస్మాత్ జాగ్రత్త అని అన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో స్టేషన్ ఘన్‌పూర్, జాఫర్‌గఢ్, లింగాల ఘన్‌పూర్ మండల పార్టీ అధ్యక్షులు మాచర్ల గణేష్, పల్లెపాటి జయపాల్‌రెడ్డి, చౌదరపల్లి శేఖర్, కౌన్సిలర్లు తాటికొండ మధు, బాలగాని అనిల్, పొన్న రాజేష్, చల్ల రమ్య-రఘురెడ్డి, మున్సిపల్ కన్వీనర్ కనకం గణేష్, మాజీ వైస్ చైర్మన్ చందర్‌రెడ్డి, నాయకులు శీలం శ్యామ్, మారేపల్లి ప్రసాద్, గుండె మల్లేష్, కుంభం కుమారస్వామి, చింత శ్రీను, ఆకారపు అశోక్, చిట్టిబాబు, హీరాసింగ్, సామాజిక మాధ్యమాల బాధ్యుడు గట్టు కృష్ణసాయి తదితరులు పాల్గొన్నారు.

# మానకొండూర్‌లో వైభవంగా గణేష్ నిమజ్జనం

- భక్తిశ్రద్ధల మధ్య గణపతి బప్పా మోరియా నినాదాలు
- డప్పు వాయిద్యాలు, భజనల మధ్య ఘనంగా శోభాయాత్ర. పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు
- నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్, సీపీ



**మానకొండూర్, సెప్టెంబర్ 23(తెలంగాణ ముచ్చట్లు ):** మానకొండూర్ మండల కేంద్రంలోని చెరువు కట్టపై గణపతి నిమజ్జన కార్యక్రమం బుధవారం భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరిగింది. మానకొండూర్ క్యాంప్ కార్యాలయంలో తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు అందుకున్న గణనాథుడిని ఘనంగా శోభాయాత్రగా తీసుకువచ్చి చెరువు కట్ట వద్ద నిమజ్జనం చేశారు.మానకొండూర్ నియోజకవర్గ శాసనసభ్యులు, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ చైర్మన్ డా. కవ్వంపల్లి సత్యనారాయణ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం హాజరయ్యారు. కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం చెరువు కట్ట వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. అధికారుల సమన్వయంతో భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుద్ధ్యం, చెరువు నీటిమట్టం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు.పెద్ద సంఖ్యలో భక్తులు, స్థానిక ప్రజలు, పార్టీ కార్యకర్తలు నిమజ్జన కార్యక్రమానికి తరలివచ్చారు. 'గణపతి బప్పా మోరియా' నినాదాలతో పరిసర ప్రాంతాలు మార్మోగగా, డప్పు వాయిద్యాలు, భజనల మధ్య గణనాథుడిని భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా డా. కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలు ప్రజల ఐక్యత, సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని అన్నారు. నియోజకవర్గంలో గణేష్ నిమజ్జనాలు ప్రశాంత వాతావరణంలో, పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా నిర్వహించాలని కోరారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ప్రజల పండుగలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తోందన్నారు. చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం స్థానిక అభివృద్ధి అంశాలను ప్రస్తావించారు.నిమజ్జన కార్యక్రమం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. వాహనాల రాకపోకలు సజావుగా సాగేందుకు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టడంతో పాటు చెరువు పరిసరాల్లో పారిశుద్ధ్య చర్యలను అధికారులు పర్యవేక్షించారు.

# రంగరాయిగూడెంలో సోలార్ ప్లాంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే





- పునరుత్పాదక ఇంధన వనరులను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం
- మరిన్ని సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు):** పీఎం కుసుమ్ పథకంలో భాగంగా ఘన్‌పూర్ ఉపవిభాగం పరిధిలోని రంగరాయిగూడెం గ్రామంలో నిర్వాహకులు నెలవంచ అజయ్‌కుమార్ నిర్మించిన రెండు మెగావాట్ల సౌర విద్యుత్ కేంద్రాన్ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులు, భూగర్భ జలాలు అడుగంటడం వంటి పరిస్థితుల నేపథ్యంలో సౌర విద్యుత్ కేంద్రాల ప్రాధాన్యత పెరుగుతోందన్నారు. సూర్యరశ్మి ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయడం వల్ల ప్రత్యామ్నాయ విద్యుత్ వనరు అందుబాటులో ఉంటుందని తెలిపారు. దీంతో విద్యుత్ సరఫరాపై ఒత్తిడి తగ్గుతుందని పేర్కొన్నారు.సౌర విద్యుత్ కేంద్రాల ఏర్పాటుతో నిర్వాహకులకు అదనపు ఆదాయం సమకూరే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం పునరుత్పాదక ఇంధన వనరులను ప్రోత్సహిస్తోందని, ఘన్‌పూర్ ఉపవిభాగం పరిధిలో మరిన్ని సౌర విద్యుత్ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ ప్లాంట్ ద్వారా ప్రతి నెల సుమారు 1.80 లక్షల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని ప్రాజెక్టు అభివృద్ధిదారు అజయ్‌రెడ్డి తెలిపారు.కార్యక్రమంలో స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్‌కుమార్, రంగరాయిగూడెం, కోమటిగూడెం సర్పంచులు జూలకుంట్ల శిరీష్‌రెడ్డి, కత్తుల సోమన్న యాదవ్, నాయకులు, విద్యుత్ శాఖ అధికారులు, ట్విలైట్ సోలార్ సంస్థ డైరెక్టర్లు ప్రభాకర్, శివకుమార్, భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మంగంపల్లిలో జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీలు

- మదనాపూర్, ఘనపూర్ జట్లకు ప్రథమ బహుమతులు



**పెద్దమందడి,సెప్టెంబర్23(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మంగంపల్లి గ్రామంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి అండర్ 17 కబడ్డీ పోటీలు ఉత్సాహభరితంగా ముగిశాయి. జిల్లాలోని 15 మండలాలకు చెందిన బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. బాలుర విభాగంలో ఉత్కంఠభరితంగా సాగిన పోటీల్లో మదనాపూర్ జట్టు ప్రథమ బహుమతి సాధించగా, కొత్తకోట జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. బాలికల విభాగంలో ఘనపూర్ జట్టు ప్రథమ బహుమతి కైవసం చేసుకోగా, పెబ్బేరు జట్టు ద్వితీయ బహుమతి సాధించింది. అమరచింత, ఆత్మకూర్, చిన్నంబావి, ఘనపూర్, గోపాల్‌పేట, కొత్తకోట, పానగల్, పెబ్బేరు, పెద్దమందడి, మదనాపూర్, రేవల్లి, వనపర్తి, వీపనగండ్ల, శ్రీరంగాపూర్, ఏదుల మండలాలకు చెందిన అండర్17 విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు.విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి క్రీడా పోటీలకు సహాయ సహకారాలు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు క్రీడల్లో తమ ప్రతిభను చాటుకునే అవకాశాలు కల్పించడంతో పాటు, ప్రతిభావంతులైన క్రీడాకారులను జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.పోటీలను 15 మండలాల పీడీల పర్యవేక్షణలో ఖిల్లా ఘణపురం మండలం పీఈటీ చిట్టెమ్మ సమన్వయంతో నిర్వహించారు. 15 మండలాలకు చెందిన ఫిజికల్ డైరెక్టర్లు, క్రీడా ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గదర్శకత్వం అందించారు. పోటీల నిర్వహణలో క్రీడా ఉపాధ్యాయులు, పీడీలు సమన్వయంతో వ్యవహరించారు.కార్యక్రమంలో డీవైఎస్ఓ సుధీర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ ఇన్‌చార్జి కుమార్, స్థానిక సర్పంచ్ రమేష్ నాయక్, గ్రామపెద్ద వెంకటరామిరెడ్డి, మండలాధ్యక్షుడు కొమ్ము వెంకటస్వామి, మాజీ ఎంపీపీ రఘు ప్రసాద్, వనపర్తి మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, ఎంపీడీవో పరిణతి, రాఘవేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, 15 మండలాల పీడీలు, క్రీడా ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# హాస్టళ్ల అభివృద్ధికి నిధులు ఇవ్వాలి.!

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు ఎమ్మెల్యే రాగమయి వినతి.




**సత్తుపల్లి, సెప్టెంబరు 23 (తెలంగాణ ముచ్చట్లు):** నియోజకవర్గంలోని సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ కోరారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సత్తుపల్లి నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. హాస్టళ్లలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అభివృద్ధి పనులు చేపట్టాలని, ఇందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని హాస్టళ్ల పరిసరాల్లో సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులకు సురక్షితమైన, మెరుగైన వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందించాలని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## హరిణి హత్య కేసు నిందితులను కఠినంగా శిక్షించాలి



- బాధిత కుటుంబానికి అండగా ఉంటాం: మంత్రి తుమ్మల.

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, సెప్టెంబరు 23 (తెలంగాణ ముచ్చట్లు):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం వెంగన్నపాలెం గ్రామానికి చెందిన హరిణి హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. హరిణి ఖమ్మంలో నర్సింగ్ చదువుతోంది. ఇటీవల లక్ష్మీదేవిపల్లి మండలం లోతువాగులోని బంధువుల ఇంటికి వెళ్లి వచ్చిన మరుసటి రోజే దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న మంత్రి తుమ్మల కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని హరిణి మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భవిష్యత్తు ఉన్న విద్యార్థిని దారుణ హత్యకు గురికావడం అత్యంత బాధాకరమన్నారు. మహిళల భద్రతకు విఘాతం కలిగించే ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. నిందితులపై కఠినంగా వ్యవహరించి, చట్టపరంగా శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. హరిణి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.

## పద్మశాలి ఐక్యతకు అభినందనీయ నిర్ణయం



- ఎన్.ఎం. రమేష్ స్వచ్ఛందంగా పోటీ నుంచి తప్పుకోగా
- అరకాల వీరేశలింగం ఏకగ్రీవ ఎన్నిక

**జమ్మికుంట, సెప్టెంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణ పద్మశాలి సేవా సమితి, పద్మశాలి కుల సంఘం ఎన్నికల్లో పద్మశాలి ఐక్యతకు ప్రతీకగా అభినందనీయ పరిణామం చోటుచేసుకుంది. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అరకాల వీరేశలింగం, ఎన్.ఎం. రమేష్‌లలో ఎన్.ఎం. రమేష్ స్వచ్ఛందంగా ఎన్నికల బరి నుంచి తప్పుకుని, అరకాల వీరేశలింగానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ మేరకు ఎన్నికల అధికారులకు తన నిర్ణయాన్ని తెలియజేస్తూ లేఖ సమర్పించారు. దీంతో అరకాల వీరేశలింగం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ.. పద్మశాలి సమాజ ఐక్యత కోసం ఎన్.ఎం. రమేష్ తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. పద్మశాలి కులబంధవులతో తనకు ఎంతో అవినాభావ సంబంధం ఉందని తెలిపారు. తన కుటుంబాన్ని రెండు పర్యాయాలు గెలిపించడంలో పద్మశాలి కులబంధవుల సహకారం ఎంతో ఉందని, ప్రస్తుతం 23వ వార్డులో తన గెలుపులోనూ వారి పాత్ర కీలకమైందని పేర్కొన్నారు.

పద్మశాలి సమాజంలో పరస్పర గౌరవం, ఐక్యత కొనసాగాలని ఆకాంక్షించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన అరకాల వీరేశలింగానికి శుభాకాంక్షలు తెలిపారు. సమాజ అభివృద్ధి, సంక్షేమం కోసం అందరూ కలిసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ దిడ్డీ రాము, అభ్యర్థి ఎన్.ఎం. రమేష్, కొండ శ్రీధర్, కొండి రమేష్‌తో పాటు ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.



## వెల్టూర్ ఎస్సీ కాలనీలో లడ్డూను రూ.19,800కు కైవసం చేసుకున్న మహేశ్వరి

**పెద్దమందడి,సెప్టెంబర్23(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలోని వెల్టూర్ ఎస్సీ కాలనీలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణేష్ ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన గణేష్ లడ్డూ వేలం పాటలో మహేశ్వరి రూ.19, 800లకు లడ్డూను కైవసం చేసుకున్నారు. వేలం పాటలో స్థానిక భక్తులు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. లడ్డూను దక్కించుకునేందుకు పలువురు పోటీపడగా, చివరకు మహేశ్వరి అత్యధికంగా రూ.19, 800లకు వేలం పాడి లడ్డూను కైవసం చేసుకున్నారు.వినాయక ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలం పాటకు స్థానికుల నుంచి మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా కాలనీ వాసులు, భక్తులు పాల్గొన్నారు.

# గంగమ్మ ఒడిలోకి గణనాథులు





- పుట్టలమ్మకుంటలో ఘనంగా నిమజ్జనం
- వర్షంలోనూ కొనసాగిన గణపయ్యల శోభాయాత్ర
- పకడ్బందీగా అధికారుల ఏర్పాట్లు

**స్టేషన్ ఘన్‌పూర్,సెప్టెంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు):** స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న గణనాథులు బుధవారం గంగమ్మ ఒడికి చేరారు. నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో మండపాల్లోని వినాయక విగ్రహాలను శోభాయాత్రగా ఊరేగిస్తూ భక్తులు పుట్టలమ్మకుంటకు తరలించి ఘనంగా నిమజ్జనం చేశారు.

డప్పు వాయిద్యాలు, డీజే సౌండ్లు, గణపతి బప్పా మోరియా నినాదాలతో పట్టణం మార్మోగింది. వర్షం కురుస్తున్నప్పటికీ యువత ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ శోభాయాత్రలో పాల్గొన్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో కోలాటాలు ఆడుతూ సందడి చేశారు.



భద్రతకు పకడ్బందీ ఏర్పాట్లు

నిమజ్జనానికి ముందుగానే పుట్టలమ్మ కుంట వద్ద అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. భక్తుల భద్రత కోసం మున్సిపాలిటీ సిబ్బందికి రక్షణ కవచాలు అందుబాటులో ఉంచారు. రాత్రివేళల్లోనూ నిమజ్జనానికి ఇబ్బందులు కలగకుండా భారీ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు.అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు వైద్య శిబిరాన్ని అందుబాటులో ఉంచారు.



భారీ వినాయక విగ్రహాలను క్రేన్ సహాయంతో తెప్పలపైకి చేర్చి, తాళ్లు, కర్రల సహాయంతో మున్సిపాలిటీ సిబ్బంది వర్షాన్ని సైతం లెక్కచేయకుండా నిమజ్జనం చేశారు.పోలీసు, మున్సిపాలిటీ, రెవెన్యూ శాఖల సిబ్బంది సమన్వయంతో నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా కొనసాగింది. గురువారం కూడా నిమజ్జనం కొనసాగనుంది.

రాజవరం రిజర్వాయర్‌లో ఘనంగా గణపయ్యల నిమజ్జనం

చిల్పూర్: చిల్పూర్ మండలంలోని రాజవరం రిజర్వాయర్ కట్టపై వినాయక నిమజ్జనానికి అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. నిమజ్జన ప్రదేశంలో విద్యుత్ దీపాలు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పోలీసులు, రెవెన్యూ, పంచాయతీ, విద్యుత్ శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేశారు.గ్రామాల్లో నిర్వహించిన గణనాథ నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో ఆయా మండపాల నుంచి వినాయక విగ్రహాలను వాడవాడలా ఊరేగింపుగా తీసుకొచ్చారు. యువత నృత్యాలు, భక్తుల నినాదాల మధ్య రిజర్వాయర్ వద్ద గణనాథులకు ఘనంగా నిమజ్జనం నిర్వహించారు.

# పుట్టలమ్మ చెరువు వద్ద గణేష్ నిమజ్జనానికి మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్ ట్రాలీ సేవలు

- అంతరాయం లేని విద్యుత్ సరఫరా కోసం ఎన్‌పీడీసీఎల్ వినూత్న ఏర్పాటు
- ఏఈ శంకర్ పర్యవేక్షణలో అప్రమత్తంగా విద్యుత్ సిబ్బంది

**స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు):** స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని పుట్టలమ్మకుంట చెరువు కట్ట వద్ద నిర్వహిస్తున్న గణేష్ నిమజ్జన కార్యక్రమానికి ఎలాంటి విద్యుత్ అంతరాయం కలగకుండా ఎన్‌పీడీసీఎల్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. నిమజ్జన కార్యక్రమం సజావుగా కొనసాగేందుకు మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్ ట్రాలీని అందుబాటులో ఉంచారు.




ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా ఘన్‌పూర్ పట్టణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. నిమజ్జనం కోసం పట్టణ శివారులోని పుట్టలమ్మకుంట చెరువు కట్ట వద్ద వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు.

నిమజ్జన సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా ఎన్‌పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్ణాటి వరుణ్‌రెడ్డి ఆలోచనల మేరకు మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్ ట్రాలీ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు.పుట్టలమ్మకుంట చెరువుకట్ట వద్ద నిమజ్జన బందోబస్తు కోసం ఇప్పటికే ఒక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దీనికి అదనంగా మరో ఫీడర్ నుంచి ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా అందించేందుకు మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్ ట్రాలీని సిద్ధంగా ఉంచారు.

ప్రకృతి వైపరీత్యాలు లేదా సాంకేతిక కారణాలతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినా, వెంటనే మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్ ట్రాలీ ద్వారా ప్రత్యామ్నాయ సరఫరాను పునరుద్ధరించేలా ఏర్పాట్లు చేశారు. నిమజ్జన కార్యక్రమానికి ఎలాంటి ఆటంకం కలగకుండా చూడడమే ఈ ఏర్పాట్ల ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు.

విద్యుత్ శాఖ సహాయ ఇంజినీర్ పగిడిముంతల శంకర్ పర్యవేక్షణలో సిబ్బంది నిమజ్జన ప్రాంతంలో అందుబాటులో ఉంటూ విద్యుత్ సరఫరాను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

# చింతకాని మండలంలో ఘనంగా ప్రారంభమైన వినాయక నిమజ్జన వేడుకలు

- పోలీసు శాఖ చర్యలతో ప్రశాంత వాతావరణం..
- డీజేలకు చరమగీతం డప్పులు, కోలాట కళాకారులకు ఉపాధి దిశగా అడుగులు

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 23(తెలంగాణ ముచ్చట్లు ):** చింతకాని మండలంలో వినాయక నిమజ్జన వేడుకలు ప్రశాంత వాతావరణంలో ఘనంగా జరుగుతున్నాయి. వినాయక ఉత్సవాల సందర్భంగా పోలీసులు ముందస్తుగా తీసుకున్న చర్యలు, నిబంధనల అమలుతో నిమజ్జన కార్యక్రమాలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా జరుగుతున్నాయి. గతంలో వినాయక నిమజ్జన వేడుకల్లో డీజే సౌండ్స్ కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు ఉండేవి. ఈసారి పోలీసులు డీజే సౌండ్స్‌పై కఠినంగా వ్యవహరించడంతో నిమజ్జన కార్యక్రమాల్లో భారీ శబ్దాలకు అడ్డుకట్ట పడింది. దీంతో వృద్ధులు, చిన్నారులు, మహిళలు, అనారోగ్యంతో ఉన్నవారికి ఇబ్బందులు తగ్గాయని స్థానికులు పేర్కొన్నారు.అదే సమయంలో కనుమరుగవుతున్న సంప్రదాయ కళలకు నిమజ్జన వేడుకలు ప్రోత్సాహాన్ని అందించాయి. డప్పులు, కోలాటాలు, ఇతర సంప్రదాయ వాయిద్యా



లతో యువత, కళాకారులు ఉత్సవాల్లో పాల్గొనడంతో వారికి ఉపాధి అవకాశాలు లభించాయి. డీజేలకు బదులుగా సంప్రదాయ కళలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా గ్రామీణ కళాకారులను ప్రోత్సహించే దిశగా అడుగులు పడినట్లయింది.వినాయక ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ చింతకాని పోలీసులు చేపట్టిన చర్యలను పలువురు అభినందించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా శాంతిభద్రతలను పరిరక్షిస్తూ పోలీసు వ్యవస్థ పనిచేస్తుందనే భావనను ఈ నిమజ్జన వేడుకలు కలిగించాయి.చింతకాని సబ్ ఇన్‌స్పెక్టర్ జి. నరేష్ ఆధ్వర్యంలో పోలీసులు చేపట్టిన చర్యలతో మండలంలో నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా జరుగుతున్నాయి.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేసిన కలెక్టర్

- విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడిన ప్రియాంక

**నారాయణపేట, సెప్టెంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు)** జిల్లా కలెక్టర్ ప్రియాంక నారాయణపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యాబోధన, విద్యార్థుల హాజరు, మౌలిక వసతులు, అధ్యాపకుల పనితీరు తదితర అంశాలపై సమగ్రంగా పరిశీలించారు. కళాశాల నిర్వహణకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. తనిఖీ సందర్భంగా కలెక్టర్ అధ్యాపకులతో సమావేశమై విద్యా కార్యక్రమాల అమలు, తరగతుల నిర్వహణ, విద్యార్థుల హాజరు శాతం, విద్యా ఫలితాల పై వివరాలు సేకరించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు తీసుకుంటున్న చర్యలను తెలుసుకుని అవసరమైన సూచనలు చేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి మరింత శ్రద్ధ వహించాలని అధ్యాపకులకు సూచించారు. కళాశాలలో తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మాధ్యమాల్లో తరగతులు నిర్వహిస్తున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం తరగతి గదులను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యాబోధన, సౌకర్యాలు, పరీక్షల సన్నాహకంపై విద్యార్థులతో చర్చించారు. ఉర్దూ మాధ్యమ ద్వితీయ సంవత్సరం విద్యార్థినులతో ప్రత్యేకంగా మాట్లాడిన కలెక్టర్ ప్రియాంక వారి భవిష్యత్ లక్ష్యాల గురించి ప్రశ్నించారు. తాము వైద్యులుగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్నామని విద్యార్థినులు తెలిపారు. వారి ఆశయాలను అభినందించిన కలెక్టర్ లక్ష్యసాధన కోసం క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు.

గురువారం - 24 - సెప్టెంబర్ - 2026

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# నేడు అంగన్‌వాడీ కేంద్రాలకు, పాఠశాలలకు,కళాశాలలకు సెలవు



- **స్థానిక సెలవు ప్రకటించిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**
- **అక్టోబర్ 10న పనిదినంగా నిర్వహించాలని ఆదేశం**

**వరంగల్, సెప్టెంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు):** వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సెప్టెంబర్ 24 గురువారం అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలలకు స్థానిక సెలవు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి తెలిపారు.

ఈ మేరకు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో కలెక్టర్ వివరాలను వెల్లడించారు. విద్యార్థులు, చిన్నారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 24న ప్రకటించిన సెలవుకు బదులుగా అక్టోబర్ 10 రెండో శనివారం రోజున అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలలు పనిదినంగా నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

# భారత్–శ్రీలంక నౌకాదళ విన్యాసాలు ముగింపు



- **సముద్ర దశలో సంయుక్త కార్యకలాపాలు**
- **ప్రత్యేక దళాల విన్యాసాలు విజయవంతం**
- **సమన్వయ సామర్థ్యాలు మరింత బలోపేతం**
- **సాగర భద్రతలో భాగస్వామ్యం విస్తరణ**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు)** భారత్, శ్రీలంక నౌకాదళాల మధ్య నిర్వహించిన సంయుక్త సముద్ర విన్యాసాలు 'ఎస్‌ఎల్‌ఐఎన్‌ఈఎక్స్-2026' సముద్ర దశ విజయవంతంగా ముగిసింది. ఈ విన్యాసాల్లో ఇరు దేశాల నౌకాదళాలు సముద్ర భద్రత, కార్యాచరణ సమన్వయం, పరస్పర సహకార సామర్థ్యాల పెంపుపై దృష్టి సారించాయి. సముద్రంలో నిర్వహించిన వివిధ వ్యూహాత్మక కార్యకలాపాలు ఇరు దేశాల మధ్య ఉన్న రక్షణ సహకారాన్ని మరింత బలోపేతం చేశాయి.

సముద్ర దశలో భాగంగా నౌకల నిర్వహణకు సంబంధించిన ప్రత్యేక విన్యాసాలు నిర్వహించారు. సముద్ర పరిస్థితుల్లో నౌకల సమన్వయం, అత్యవసర పరిస్థితుల్లో స్పందన, కార్యాచరణ సామర్థ్యాల పరీక్ష వంటి అంశాలపై విస్తృతంగా శిక్షణ కార్యక్రమాలు చేపట్టారు. ఇరు దేశాల నౌకాదళ సిబ్బంది సంయుక్తంగా పాల్గొని అనుభవాలను పంచుకున్నారు. విన్యాసాల్లో వైమానిక కార్యకలాపాలు కూడా కీలకంగా నిలిచాయి. సముద్రంపై గగనతల పర్యవేక్షణ, వ్యూహాత్మక సమాచార మార్పిడి, సంయుక్త కార్యాచరణ విధానాలపై శిక్షణ నిర్వహించారు. రాత్రి సమయంలో సముద్రంలో సరఫరా నిర్వహణకు సంబంధించిన ప్రత్యేక విన్యాసాలను కూడా విజయవంతంగా పూర్తి చేశారు. క్లిష్ట పరిస్థితుల్లో కార్యాచరణ కొనసాగించే సామర్థ్యాన్ని ఈ సందర్భంగా పరీక్షించారు. ప్రత్యేక దళాల సంయుక్త విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనుమానాస్పద నౌకలను తనిఖీ చేసి స్వాధీనం చేసుకునే విధానాలు, సముద్ర భద్రతకు సంబంధించిన ప్రత్యేక చర్యలు, తాడుల సహాయంతో హెలికాప్టర్ల నుంచి దిగే విన్యాసాలు నిర్వహించారు. ఉగ్రవాద నిరోధక చర్యలు, సముద్ర నేరాల నియంత్రణకు సంబంధించిన వ్యూహాలపై కూడా శిక్షణ చేపట్టారు.

ఈ విన్యాసాల ద్వారా ఇరు దేశాల నౌకాదళాల మధ్య పరస్పర అవగాహన, సమన్వయం, కార్యాచరణ సామర్థ్యాలు మరింత పెరిగాయని అధికారులు తెలిపారు. సముద్ర భద్రత, విపత్తు నిర్వహణ, మానవతా సహాయ కార్యక్రమాలు, ప్రాంతీయ స్థిరత్వం వంటి అంశాల్లో కలిసి పనిచేసే సామర్థ్యాన్ని ఈ విన్యాసాలు మరింత బలోపేతం చేశాయని పేర్కొన్నారు. ఎస్‌ఎల్‌ఐఎన్‌ఈఎక్స్-2026 ముగింపుతో భారత్-శ్రీలంక సముద్ర భాగస్వామ్యం మరో మెట్టు ముందుకు వెళ్లిందని అధికారులు వెల్లడించారు. హిందూ మహాసముద్ర ప్రాంతంలో శాంతి, భద్రత, సహకారాన్ని ప్రోత్సహించే దిశగా ఇలాంటి సంయుక్త విన్యాసాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఇరు దేశాల మధ్య సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న స్నేహపూర్వక రక్షణ సంబంధాలకు ఈ విన్యాసాలు మరింత బలాన్ని చేకూర్చాయని పేర్కొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం





- **అర్హులందరికీ.. పక్కా ఇళ్లు అందించాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యం**
- **రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి**
- **భద్రాచలంలోని అంబ సత్రం మార్గంలో నూతన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి.. లబ్ధిదారుకు బట్టలు పెట్టిన శీనన్న**

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 23(తెలంగాణ ముచ్చట్లు ):** పేద, మధ్యతరగతి కుటుంబాల్లో సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అర్హులైన పేదలందరికీ మూడో విడతలో, అవసరమైతే నాలుగో విడతలో నూ ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తామని తెలిపారు. భద్రాచలంలోని అంబ సత్రం సమీపంలోని కాలనీలో లబ్ధిదారు మామిడి మౌనిక నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం ఉదయం ప్రారంభించారు. మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, కలెక్టర్ అంకిత్‌లతో కలిసి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు .ఈ సందర్భంగా లబ్ధిదారు కుటుంబ సభ్యులకు మంత్రి నూతన వస్త్రాలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి అక్కాచెల్లెళ్ల కుటుంబాల్లో సొంతింటి కలను నిజం చేసి, వారి జీవితాల్లో ఆనందం నింపాలన్న సదుద్దేశంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందన్నారు. అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు .ఈ కార్యక్రమంలో: ఎస్పీ రోహిత్‌రాజ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు దేవీప్రసన్న, పలువురు కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# శ్రీరామనవమి నాటికి.. నిర్మాణ పనులన్నీ పూర్తి కావాలి

- **రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**
- **భద్రాచల దేవస్థానంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి ప్రత్యేక పూజలు, ప్రాకారాల నిర్మాణాల పరిశీలన**
- **సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష**



**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 23(తెలంగాణ ముచ్చట్లు ):** వచ్చే ఏడాది శ్రీరామనవమి నాటికి భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థాన ప్రాకారాలు, మాడ వీధుల పున:నిర్మాణ పనులు పూర్తి కావాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంబంధిత కాంట్రాక్టర్లను, అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం మహబాద్ ఎంపీ బలరాం నాయక్,
భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్, అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్, డిసిసి అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న లతో కలిసి
దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు.. వేద ఆశీర్వచనాలతో తీర్థప్రసాదాలు అందజేశారు.

వర్షం కురుస్తున్నా పనుల పరిశీలన

బుధవారం ఉదయం నుంచి భద్రాచలం పరిసర ప్రాంతాల్లో వర్షం కురుస్తున్నప్పటికీ.. ముందస్తు షెడ్యూల్ ప్రకారం మంత్రి పొంగులేటి దేవాలయం చేరుకున్నారు. దమ్మక్క అన్నదాన సత్రం నుంచి.. మెట్లదారి వరకు వర్షపు చినుకులు కురుస్తున్నా.. బురదలోనే దేవస్థానం చుట్టూ కలియతిరిగి నేరుగా పనులను పరిశలించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం నెలకొనొద్దని సూచనలు చేశారు. ఆ తర్వాత భద్రాచలంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు.

వంద శాతం పనులు పూర్తి చేయిస్తాం..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో.. రూ.300 కోట్ల నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను ఈనెల 4వ తేదీన పరిశీలించానని, మళ్లీ ఇప్పటివరకు జరిగిన పురోగతిని నేరుగా తెలుసుకునేందుకు వచ్చినట్లు వెల్లడించారు. అధికారులు కూడా నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, ఆగమ శాస్త్ర నిబంధనల ప్రకారం పునఃనిర్మాణ పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు. భక్తులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు అందేలా.. సకాలంలో పూర్తి చేస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు.





# బీఆర్ఎస్ ది దోపిడీ పాలన.. కాంగ్రెస్ ది సంక్షేమ పాలన

- **మారెళ్ళ పాడు ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవంలో రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**
- **పులుసుబొంత ప్రాజెక్టును కూడా పూర్తి చేస్తామని వెల్లడి**

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 23(తెలంగాణ ముచ్చట్లు ):** గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సాగునీటి ప్రాజెక్టులను రీ డిజైన్ ల పేర్లతో నిర్లక్ష్యం చేసి.. రూ.వేలాది కోట్ల తెలంగాణ ప్రజల సొమ్మును దోచుకున్నారని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వాపురం మండలం మారెళ్ళ పాడు ఎత్తిపోతల పథకాన్ని.. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రసంగించారు.

మండలంలోని 23 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తాం..

ప్రస్తుతం ఈ ప్రాజెక్టు ద్వారా తుమ్మల చెరువు నుంచి 4,300 ఎకరాలకు సాగునీరు అందుతుందని, భవిష్యత్తులో అశ్వాపురం మండలంలోని అన్ని ప్రాంతాల పరిధిలో 23 వేల ఎకరాలకు సాగునీరు అందేలా కృషి చేస్తామని వెల్లడించారు. స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు విజ్ఞప్తి మేరకు.. అనేక ఏళ్లుగా పెండింగ్లో ఉన్న పులుసు బొంత ప్రాజెక్ట్ పూర్తి చేస్తామని, అవసరమైన భూసేకరణ, అటవీ క్లియరెన్స్ ను ఆచరణలోకి తెస్తామని అన్నారు.

వైఎస్సార్ హయాంలో శంకుస్థాపనలు చేస్తే.. గత పాలకుల స్వలాభం కోసం రీ డిజైన్లు

దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్సార్ హయాంలో.. ఉమ్మడి జిల్లాలో ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తే.. బీఆర్ఎస్ పాలకులు రీ డిజైన్ల పేరుతో వేల కోట్లాది రూపాయలను దండుకునేందుకు.. సీతారామ ప్రాజెక్టు ను వారి స్వలాభాలకు ఎలా మార్చుకున్నారో అందరికీ తెలిసిన విషయమేనని విమర్శించారు. తమ ప్రభుత్వం వచ్చాక మారేళ్లపాడు ప్రాజెక్టు పూర్తి చేశామని, భవిష్యత్తులో అనేక సాగునీటి ప్రాజెక్టులను రైతులకు అందుబాటులోకి తెస్తామని అన్నారు.

మాది చిత్తశుద్ధి ఉన్న ప్రభుత్వం..

పదేళ్లు రేషన్ కార్డు ఊసే ఎత్తకుండా పాలించారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు ఇచ్చామని అన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా ఇచ్చామని, రూ.72 వేల కోట్ల వడ్డీ లేని రుణాలను మహిళలకు అందించామని తెలిపారు.కులమతాలకతీతంగా తమ పాలన సాగుతుండగా.. బీఆర్ఎస్ వారేమో అసెంబ్లీ దళిత స్పీకర్ తల్లి పట్ల అహంకార పూరిత భాషతో మాట్లాడుతుండటం బాధాకరమని అన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను 3, 4 విడతల్లో కూడా అందజేస్తామని, సంక్షేమ ఫలాలు అందరికీ అందేలా చూస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో:మహబూబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్, కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# పశ్చిమ బెంగాల్‌లో ముదిరిన వివాదం

- **ఓటర్ల జాబితాపై రాజకీయ దుమారం**
- **ఎన్నికల సంఘంపై ప్రతిపక్ష విమర్శలు**
- **సర్ ప్రక్రియపై ఆరోపణల వెల్లువ**
- **కొత్త రాజకీయ సమరానికి తెర**

**కోల్‌కతా, సెప్టెంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు)** పశ్చిమ బెంగాల్‌లో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించిన వివాదం మరింత తీవ్రరూపం దాల్చింది. ఓటర్ల పేర్ల చేర్పు, తొలగింపు వంటి అంశాలపై ఎన్నికల సంఘం కమిషనర్ల మధ్య విభేదాలు ఉన్నాయన్న వార్తలు వెలుగులోకి రావడంతో రాజకీయ వర్గాల్లో చర్చలు వేడెక్కాయి. ఈ నేపథ్యంలో అధికార తృణమూల్ కాంగ్రెస్ నేతలు ఎన్నికల సంఘం తీరుపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ కేంద్ర ఎన్నికల వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ఈ వివాదంపై స్పందించిన మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పాత ఓటర్ల జాబితాతోనే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అనుమానాలు తలెత్తకుండా ఎన్నికల సంఘం పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలని కోరారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై కూడా ఆమె తీవ్ర విమర్శలు గుప్పించారు. దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిరసనలు చేపడతామని ప్రకటించారు.

తృణమూల్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ కూడా ఎన్నికల సంఘంపై ఆరోపణలు చేశారు. పశ్చిమ బెంగాల్‌లో లక్షలాది మంది ఓటర్ల పేర్లు ఉద్దేశపూర్వకంగా తొలగించబడ్డాయని ఆయన ఆరోపించారు. ఇతర రాష్ట్రాల్లో కూడా ఇలాంటి పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొంటూ ఎన్నికల సంఘం నిర్ణయాలపై న్యాయపరమైన పర్యవేక్షణ అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై స్వతంత్ర దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు. మరోవైపు ఈ అంశంపై ఎన్నికల సంఘం స్పష్టీకరణ ఇచ్చింది. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియతో పాటు అన్ని ప్రధాన నిర్ణయాలు ముగ్గురు ఎన్నికల కమిషనర్ల ఏకగ్రీవ ఆమోదంతోనే తీసుకున్నట్లు వెల్లడించింది. చర్చల సమయంలో అధికారులు, కమిషనర్లు సూచనలు ఇవ్వడం సహజ పరిపాలనా విధానంలో భాగమేనని స్పష్టం చేసింది. అధికారికంగా ఎలాంటి భిన్నాభిప్రాయాలు నమోదు కాలేదని పేర్కొంది.

# దశాబ్దాల భూసమస్యకు పరిష్కారం



- **నర్సాపూర్ గ్రామస్థులకు పట్టాల పంపిణీ**
- **కలెక్టర్ చొరవతో సమస్య పరిష్కారం**
- **గ్రామస్థుల ఆనందం, కృతజ్ఞతలు**
- **దీర్ఘకాల నిరీక్షణకు తెరపడింది**

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు)** గత పదేళ్లుగా భూముల పట్టాల కోసం ఎదురుచూస్తున్న ఉట్నూర్ మండలం నర్సాపూర్ గ్రామస్థుల దీర్ఘకాలిక భూసమస్యకు జిల్లా కలెక్టర్ రాజర్షి షా చొరవతో పరిష్కారం లభించింది. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అర్హులైన గ్రామస్థులకు భూమి పట్టాలను పంపిణీ చేశారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్య పరిష్కారం కావడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. నర్సాపూర్ గ్రామానికి చెందిన పలువురు కుటుంబాలు భూములను సాగు చేసుకుంటున్నప్పటికీ అధికారిక పట్టాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భూ హక్కుల ధ్రువీకరణ లేకపోవడంతో ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందడంలోనూ, ఆర్థిక లావాదేవీల్లోనూ సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం సమస్యను ప్రత్యేకంగా పరిశీలించి అవసరమైన ప్రక్రియలను పూర్తి చేసింది.

జిల్లా కలెక్టర్ రాజర్షిషా మార్గదర్శకత్వంలో రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించి భూముల వివరాలను ధృవీకరించారు. అర్హులైన కుటుంబాలను గుర్తించి నిబంధనల ప్రకారం పట్టాల మంజూరు ప్రక్రియను వేగవంతం చేశారు. ఫలితంగా ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యకు పరిష్కారం లభించి గ్రామస్థులకు భూ హక్కుల పత్రాలు అందాయి. పట్టాలు అందుకున్న గ్రామస్థులు కలెక్టర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. చాలా కాలంగా ఎదురుచూస్తున్న సమస్య పరిష్కారం కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. భూములపై తమ హక్కులు అధికారికంగా గుర్తింపు పొందడంతో భవిష్యత్తులో మరింత భరోసాతో వ్యవసాయ కార్యకలాపాలు నిర్వహించగలమని పేర్కొన్నారు.

జిల్లా పరిపాలన ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తోందని అధికారులు తెలిపారు. రెవెన్యూ సంబంధిత సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారంలో పారదర్శకత, వేగం ఉండేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, తహసీల్దార్ కోట్నాక రఘునాథరావు, నర్సాపూర్ సర్పంచ్ గెడం జగదిరావు, పట్టాదారులు, గ్రామస్థులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు. భూహక్కుల పత్రాల పంపిణీతో గ్రామస్థుల దీర్ఘకాలిక నిరీక్షణకు ముగింపు పలుకుతూ కార్యక్రమం ముగిసింది.

# ఘనంగా గురుపూజోత్సవ వేడుకలు




- **200 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం**
- **25 ఏళ్లుగా కొనసాగుతున్న సంప్రదాయం**
- **పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి**

**పటాన్చెరు, సెప్టెంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు)** పటాన్చెరు నియోజకవర్గంలో ప్రైవేట్ పాఠశాలల గురుపూజోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రైవేట్ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యాసంస్థల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యారంగంలో విశిష్ట సేవలు అందించిన ఉపాధ్యాయులను సన్మానిస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వివిధ ప్రైవేట్ పాఠశాలల నుంచి ఎంపికైన 200 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. శాలువాలు, ప్రశంసాపత్రాలు అందజేసి వారి సేవలను కొనియాడారు. ఉపాధ్యాయులు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి కృషి వల్లే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించగలుగుతున్నారని పలువురు వక్తలు పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ ఒక దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే రూపుదిద్దుకుంటుందని అన్నారు. ప్రతి విద్యార్థిని ఉత్తమ పౌరుడిగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని పేర్కొన్నారు. చదువుతో పాటు నైతిక విలువలు, సామాజిక బాధ్యతలు, కుటుంబ బంధాల ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. గత 25 సంవత్సరాలుగా గురుపూజోత్సవ వేడుకలను నిర్వహిస్తూ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులను సన్మానించడం తనకు గర్వకారణమని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ అనే తేడా లేకుండా విద్యార్థుల భవిష్యత్తు కోసం కృషి చేస్తున్న ప్రతి ఉపాధ్యాయుడి సేవలు ప్రశంసనీయమని అన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థల నుంచి పోటీ ఉన్నప్పటికీ ప్రైవేట్ పాఠశాలలు మంచి ఫలితాలు సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు.ప్రస్తుత కాలంలో మొబైల్ ఫోన్ల వినియోగం విద్యార్థులపై ప్రభావం చూపుతోందని ఎమ్మెల్యే ఆందోళన వ్యక్తం చేశారు. సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటే అభివృద్ధికి దోహదపడుతుందని, దుర్వినియోగం చేస్తే సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల విద్యా పురోగతితో పాటు వారి మానసిక స్థితి, ప్రవర్తనపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, ప్రైవేట్ పాఠశాలల సంక్షేమ సంఘం ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు భారీ సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేశారు. ఉపాధ్యాయుల సేవలను గౌరవించే ఇటువంటి కార్యక్రమాలు విద్యారంగానికి మరింత ప్రేరణనిస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు.

# సైబర్ ప్రపంచంలో పిల్లలపై భద్రత ఎంత..?

- **డిజిటల్ యుగంలో పెరుగుతున్న సవాళ్లు**
- **తల్లిదండ్రుల అప్రమత్తతే ప్రధాన రక్షణ**
- **సాంకేతిక వినియోగంలో సమతుల్యత అవసరం**
- **సురక్షిత భవిష్యత్తుకు కుటుంబాల బాధ్యత**



**డెస్క్, సెప్టెంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు)** ప్రస్తుత డిజిటల్ యుగంలో పిల్లల జీవనశైలిలో సాంకేతికత ఒక విడదీయరాని భాగంగా మారింది. చదువు, వినోదం, సమాచార సేకరణ, స్నేహితులతో సంభాషణ వంటి అనేక అవసరాల కోసం పిల్లలు ఇంటర్నెట్‌ను విస్తృతంగా వినియోగిస్తున్నారు. స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్లెట్లు, కంప్యూటర్లు చిన్న వయసులోనే వారి చేతుల్లోకి చేరుతున్నాయి. సాంకేతికత అనేక అవకాశాలను అందిస్తున్నప్పటికీ, అదే సమయంలో పలు ప్రమాదాలకు కూడా తలుపులు తెరుస్తోంది. ఈ నేపథ్యంలో పిల్లల సైబర్ భద్రత కుటుంబాలు, పాఠశాలలు, సమాజం ముందున్న ఒక కీలక బాధ్యతగా మారింది. ఇంటర్నెట్‌లో లభించే అపారమైన సమాచారం పిల్లల విజ్ఞానాన్ని పెంచగలదు. అయితే అదే వేదికలో వయస్సుకు అనుకూలం కాని విషయాలు, తప్పుడు సమాచారం, హానికరమైన ప్రచారాలు కూడా ఉంటాయి. సరైన పర్యవేక్షణ లేకుండా పిల్లలు ఈ కంటెంట్ ప్రభావానికి లోనయ్యే ప్రమాదం ఉంది. చిన్న వయసులోనే వారు చూసే విషయాలు వారి ఆలోచనా విధానం, ప్రవర్తన, వ్యక్తిత్వంపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. అందువల్ల పిల్లలు ఏ వెబ్‌సైట్లు, ఏ అనువర్తనాలు ఉపయోగిస్తున్నారో తల్లిదండ్రులు తెలుసుకోవడం అవసరం. సామాజిక మాధ్యమాల విస్తరణతో పిల్లలు ప్రపంచంతో సులభంగా అనుసంధానమవుతున్నారు. అయితే ఈ అవకాశంతో పాటు సైబర్ వేధింపులు, మోసాలు, వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం వంటి సమస్యలు కూడా పెరుగుతున్నాయి. అపరిచితులతో స్నేహాలు, తప్పుడు గుర్తింపులతో జరిగే సంభాషణలు, మోసపూరిత లింకులు పిల్లలను ప్రమాదంలోకి నెట్టే అవకాశం కలిగి ఉంటాయి. చాలాసార్లు పిల్లలు ఈ ప్రమాదాలను గుర్తించలేకపోవడం వల్ల అనుకోని ఇబ్బందుల్లో చిక్కుకుంటారు. అందుకే వారికి సైబర్ ప్రపంచంలోని ముప్పుల గురించి ముందుగానే అవగాహన కల్పించడం అవసరం. తల్లిదండ్రుల పాత్ర ఇక్కడ అత్యంత కీలకంగా మారుతుంది. పిల్లలకు పరికరాలు అందించడం మాత్రమే కాకుండా వాటిని బాధ్యతాయుతంగా ఉపయోగించే విధానాన్ని కూడా నేర్పించాలి. ఇంటర్నెట్‌లో వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని, అపరిచితుల సందేశాలకు స్పందించవద్దని, అనుమానాస్పద లింకులను తెరవవద్దని పిల్లలకు స్పష్టంగా తెలియజేయాలి. పిల్లలతో తరచూ సంభాషిస్తూ వారి ఆన్‌లైన్ అనుభవాల గురించి తెలుసుకోవడం ద్వారా అనేక సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించవచ్చు.సాంకేతిక నియంత్రణ సాధనాల వినియోగం కూడా అవసరం. తల్లిదండ్రుల పర్యవేక్షణ సౌకర్యాలు, వయస్సుకు అనుగుణమైన కంటెంట్ నియంత్రణ వ్యవస్థలు, సమయ పరిమితులు వంటి సాధనాలు పిల్లల భద్రతకు తోడ్పడతాయి. అయితే కేవలం సాంకేతిక నియంత్రణలపై ఆధారపడటం సరిపోదు. పిల్లల్లో బాధ్యత, స్వీయ నియంత్రణ, జాగ్రత్త అనే విలువలను పెంపొందించడం మరింత ముఖ్యమైనది. విశ్వాసపూర్వక సంబంధం ఉన్నప్పుడు పిల్లలు ఎదుర్కొనే సమస్యలను తల్లిదండ్రులతో పంచుకునే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

ఆన్‌లైన్ తరగతులు, డిజిటల్ విద్యా వనరులు పిల్లల అభ్యాసానికి ఎంతో ఉపయోగపడుతున్నాయి. అయితే పరికరాల వినియోగం అవసరాన్ని మించి పెరిగితే శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఎక్కువసేపు తెర ముందు గడపడం వల్ల కంటి సమస్యలు, నిద్రలేమి, ఏకాగ్రత లోపం వంటి సమస్యలు తలెత్తవచ్చు. అందువల్ల డిజిటల్ వినియోగానికి సమతుల్యత అవసరం. చదువు, ఆటలు, కుటుంబంతో గడిపే సమయం మధ్య సమన్వయం ఉండేలా తల్లిదండ్రులు మార్గనిర్దేశం చేయాలి.పాఠశాలలు కూడా ఈ బాధ్యతలో భాగస్వాములు కావాలి. సైబర్ భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, విద్యార్థులకు డిజిటల్ నైతిక విలువలను బోధించడం అవసరం. సురక్షిత ఆన్‌లైన్ ప్రవర్తన గురించి చిన్న వయసు నుంచే విద్యార్థులకు తెలియజేస్తే వారు భవిష్యత్తులో మరింత జాగ్రత్తగా వ్యవహరించే అవకాశం ఉంటుంది. కుటుంబం, పాఠశాల, సమాజం కలిసి పనిచేసినప్పుడే పిల్లలకు సురక్షిత డిజిటల్ వాతావరణాన్ని కల్పించగలుగుతాయి. సైబర్ నేరాల రూపాలు రోజురోజుకూ మారుతున్నాయి. మోసపూరిత సందేశాలు, నకిలీ ఖాతాలు, ఆర్థిక మోసాలు, గుర్తింపు దొంగతనం వంటి ప్రమాదాలు మరింత సంక్లిష్టంగా మారుతున్నాయి. ఈ పరిస్థితుల్లో తల్లిదండ్రులు కూడా సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలి. పిల్లలు ఉపయోగించే వేదికలు, అనువర్తనాలు, కొత్త ధోరణుల గురించి తెలుసుకోవడం ద్వారా వారికి సరైన మార్గదర్శకత్వం అందించవచ్చు.

పిల్లలు డిజిటల్ ప్రపంచానికి దూరంగా ఉండలేరు. భవిష్యత్తు విద్య, ఉపాధి, సామాజిక సంబంధాలు అన్నీ సాంకేతికతతో ముడిపడి ఉన్నాయి. అందువల్ల వారిని భయపెట్టడం కాదు, సురక్షితంగా ఉపయోగించే నైపుణ్యాలను నేర్పించడం ముఖ్యం. బాధ్యతాయుత వినియోగం, జాగ్రత్త, అవగాహన అనే మూడు అంశాలు పిల్లల సైబర్ భద్రతకు బలమైన పునాదులుగా నిలుస్తాయి. డిజిటల్ యుగంలో పిల్లల భద్రత కేవలం సాంకేతిక అంశం మాత్రమే కాదు, అది సామాజిక బాధ్యత కూడా. పిల్లల భవిష్యత్తును రక్షించాలంటే కుటుంబాలు అప్రమత్తంగా ఉండాలి. ప్రేమతో కూడిన పర్యవేక్షణ, నిరంతర సంభాషణ, సరైన మార్గదర్శకత్వం ద్వారా పిల్లలను సైబర్ ప్రమాదాల నుంచి కాపాడవచ్చు. సురక్షితమైన డిజిటల్ వాతావరణాన్ని కల్పించడం ద్వారా జ్ఞానం, సృజనాత్మకత, బాధ్యతతో కూడిన కొత్త తరాన్ని తీర్చిదిద్దడం సాధ్యమవుతుంది.

# ప్రపంచ వాణిజ్యానికి సముద్ర మార్గాలే బలం

- **సముద్ర రవాణా ప్రాధాన్యంపై అవగాహన**
- **ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కీలక ఆధారం**



**డెస్క్, సెప్టెంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు)** ప్రపంచ సముద్ర రవాణా దినోత్సవం ప్రతి ఏడాది సెప్టెంబర్ నెలలో నిర్వహించబడే ఒక ముఖ్యమైన అంతర్జాతీయ సందర్భంగా గుర్తింపు పొందింది. ప్రపంచ దేశాల మధ్య వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడంలో, ఆర్థిక వ్యవస్థలను అనుసంధానించడంలో సముద్ర రవాణా రంగం పోషిస్తున్న పాత్రను గుర్తు చేసేందుకు ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఆధునిక ప్రపంచంలో ఆహార ధాన్యాల నుంచి భారీ యంత్రాల వరకు అనేక రకాల వస్తువులు దేశాల మధ్య మార్పిడి కావడానికి సముద్ర మార్గాలే ప్రధాన ఆధారంగా ఉన్నాయి. ప్రపంచ ఆర్థికాభివృద్ధి వేగంగా సాగడానికి నౌకాయాన రంగం అందిస్తున్న సేవలు అపారమైనవి. అందువల్ల ఈ రంగం ప్రాధాన్యాన్ని ప్రజలకు తెలియజేయడం, భద్రతా ప్రమాణాలను మెరుగుపరచడం, పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారించడం ఈ దినోత్సవ ప్రధాన ఉద్దేశ్యంగా ఉంది.ప్రపంచ వాణిజ్యంలో దాదాపు అన్ని దేశాలు సముద్ర రవాణాపైనే అధికంగా ఆధారపడుతున్నాయి. ఒక దేశంలో ఉత్పత్తి అయిన వస్తువులు వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న మరో దేశానికి చేరుకోవడానికి సముద్ర మార్గాలే అత్యంత తక్కువ వ్యయంతో కూడిన పరిష్కారంగా నిలుస్తున్నాయి. విమానాలు వేగంగా ప్రయాణించినప్పటికీ భారీ పరిమాణంలో సరుకులను తరలించడంలో నౌకలకు ప్రత్యామ్నాయం లేదు. అందుకే చమురు, బొగ్గు, ఉక్కు, ధాన్యాలు, ఎరువులు, వాహనాలు, వినియోగ వస్తువులు వంటి అనేక ఉత్పత్తులు సముద్ర మార్గాల ద్వారానే ప్రపంచ మార్కెట్లకు చేరుతున్నాయి. సముద్ర రవాణా వ్యవస్థలో అంతరాయం ఏర్పడితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రత్యక్ష ప్రభావం పడే పరిస్థితి ఉంటుంది. సముద్రాలు కేవలం రవాణా మార్గాలుగానే కాకుండా ప్రపంచ దేశాల మధ్య సహకారానికి వేదికలుగా కూడా నిలుస్తున్నాయి. ఒక దేశానికి అవసరమైన ముడి పదార్థాలు, ఇంధన వనరులు, పారిశ్రామిక ఉత్పత్తులు ఇతర దేశాల నుంచి సముద్ర మార్గాల ద్వారానే చేరుతాయి. ఈ ప్రక్రియ వల్ల ప్రపంచ దేశాల మధ్య ఆర్థిక సంబంధాలు మరింత బలపడుతున్నాయి. అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాలు, దిగుమతిఎగుమతి కార్యకలాపాలు, పారిశ్రామిక అభివృద్ధి అన్నీ సముద్ర రవాణా వ్యవస్థతో ముడిపడి ఉన్నాయి. ప్రపంచీకరణ యుగంలో సముద్రాల ప్రాధాన్యం మరింత పెరిగిందని నిపుణులు చెబుతున్నారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ నౌకాయాన రంగంలో కూడా విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఆధునిక నౌకలు మరింత సురక్షితంగా, వేగంగా, అధిక సామర్థ్యంతో సరుకులను తరలించే విధంగా రూపుదిద్దుకుంటున్నాయి. ఉపగ్రహ ఆధారిత మార్గదర్శక వ్యవస్థలు, డిజిటల్ పర్యవేక్షణ, వాతావరణ అంచనాలు, అత్యవసర హెచ్చరిక వ్యవస్థలు నౌకల ప్రయాణాన్ని మరింత సమర్థవంతంగా మార్చుతున్నాయి.

దీనివల్ల ప్రమాదాల అవకాశాలు తగ్గడంతో పాటు సమయపాలన కూడా మెరుగుపడుతోంది. భవిష్యత్తులో మరింత అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ఈ రంగాన్ని కొత్త దిశలో నడిపించే అవకాశం ఉంది. సముద్ర రవాణా రంగం అభివృద్ధి చెందుతున్నప్పటికీ అనేక సవాళ్లు కూడా ఎదురవుతున్నాయి. సముద్ర దోపిడీలు, తీవ్ర వాతావరణ పరిస్థితులు, తుఫాన్లు, నౌక ప్రమాదాలు వంటి అంశాలు ఈ రంగానికి ప్రధాన సవాళ్లుగా ఉన్నాయి. ముఖ్యంగా అంతర్జాతీయ సముద్ర మార్గాల్లో భద్రతను కాపాడటం ప్రతి దేశానికి అత్యంత ముఖ్యమైన బాధ్యతగా మారింది. నౌకల సురక్షిత ప్రయాణం కోసం అంతర్జాతీయ స్థాయిలో అనేక నియమాలు, ప్రమాణాలు అమలులో ఉన్నాయి. భద్రతా చర్యలను మరింత పటిష్ఠం చేయడం ద్వారా ప్రమాదాలను తగ్గించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. సముద్ర పర్యావరణ పరిరక్షణ ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. నౌకల నుంచి విడుదలయ్యే కాలుష్య పదార్థాలు, ఇంధన లీకేజీలు, ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్ర జీవవ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. సముద్రాల్లో నివసించే చేపలు, పగడపు దిబ్బలు, ఇతర జీవరాశులు ఈ కాలుష్యం వల్ల ప్రమాదంలో పడుతున్నాయి.

ఈ సమస్యను ఎదుర్కొనేందుకు పర్యావరణ హిత ఇంధనాల వినియోగం, వ్యర్థాల నియంత్రణ, కాలుష్య నిరోధక సాంకేతికతలను ప్రోత్సహిస్తున్నారు. సముద్ర సంపదను కాపాడుకోవడం మానవాళి భవిష్యత్తుకు అత్యంత అవసరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.భారత్‌కు సుమారు ఏడు వేల కిలోమీటర్లకు పైగా విస్తరించిన తీరప్రాంతం ఉండటంతో సముద్ర రవాణా రంగంలో విశేష అవకాశాలు ఉన్నాయి. దేశంలోని ప్రధాన ఓడరేవులు అంతర్జాతీయ వాణిజ్యానికి కీలక కేంద్రాలుగా అభివృద్ధి చెందుతున్నాయి. సరుకు రవాణా సామర్థ్యాన్ని పెంచేందుకు కొత్త మౌలిక వసతులు నిర్మిస్తున్నారు. తీరప్రాంత ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు పారిశ్రామికాభివృద్ధికి కూడా ఇది దోహదపడుతోంది. దేశ ఆర్థికాభివృద్ధిలో నౌకాయాన రంగం పాత్ర రోజురోజుకూ పెరుగుతోంది.సముద్ర రవాణా రంగం ద్వారా లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తోంది. నౌక నిర్మాణం, ఓడరేవుల నిర్వహణ, సరుకు రవాణా, మత్స్యరంగం, పర్యాటక రంగం వంటి అనేక విభాగాలు ఈ వ్యవస్థతో అనుసంధానమై ఉన్నాయి. ఒక సమర్థవంతమైన సముద్ర రవాణా వ్యవస్థ దేశ అభివృద్ధికి మాత్రమే కాకుండా సామాజిక పురోగతికి కూడా దోహదపడుతుంది. యువతకు కొత్త ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ఈ రంగం కీలక పాత్ర పోషిస్తోంది.వాతావరణ మార్పుల ప్రభావం సముద్ర రవాణాపైనా కనిపిస్తోంది. సముద్ర మట్టం పెరగడం, తీవ్ర తుఫాన్ల సంఖ్య అధికం కావడం, వాతావరణ అస్థిరత వంటి అంశాలు నౌకాయాన రంగానికి కొత్త సవాళ్లను సృష్టిస్తున్నాయి.

ఈ పరిస్థితులను ఎదుర్కొనేందుకు దేశాలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది. పర్యావరణానికి హాని కలిగించకుండా సముద్ర రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయడం ప్రస్తుతం ప్రపంచ సమాజం ముందున్న ప్రధాన లక్ష్యంగా మారింది. ప్రపంచ సముద్ర రవాణా దినోత్సవం సముద్రాల ప్రాధాన్యాన్ని, నౌకాయాన రంగం సేవలను, పర్యావరణ పరిరక్షణ అవసరాన్ని గుర్తు చేసే ఒక విలువైన సందర్భంగా నిలుస్తోంది. ప్రపంచ వాణిజ్యానికి ప్రాణాధారంగా ఉన్న ఈ రంగం మరింత సురక్షితంగా, సమర్థవంతంగా, పర్యావరణ హితంగా మారితే ప్రపంచ ఆర్థికాభివృద్ధికి కొత్త ఊపు లభిస్తుంది. సముద్ర సంపదను సంరక్షిస్తూ భవిష్యత్ తరాలకు అందించడం ప్రతి దేశం, ప్రతి పౌరుడి బాధ్యత.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# భారీ వర్షాలపై కలెక్టర్లకు మంత్రి ఆదేశాలు

- రెడ్ అలర్ట్ జిల్లాల్లో అప్రమత్తత పెంచాలి
- ముందస్తు సహాయక చర్యలు వేగవంతం చేయాలి
- ప్రజల భద్రతకు ప్రత్యేక ప్రణాళికలు అమలు
- కంట్రోల్ రూమ్‌లు నిరంతరం అందుబాటులో ఉండాలి
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




**హైదరాబాద్, సెప్టెంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు)** అల్పపీడనం ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలో మరో రెండు రోజుల పాటు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్లకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా రెడ్ అలర్ట్ ప్రకటించిన జిల్లాల్లో అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి స్పష్టం చేశారు. ఈ జిల్లాల్లో భారీ వర్షాలు, వరదల ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని పేర్కొన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ స్థాయి అధికారులు, రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్ శాఖల సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.

లోతట్టు ప్రాంతాలు, వాగులు, వంకలు, చెరువులు, నదీ పరివాహక ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని మంత్రి ఆదేశించారు. ప్రమాద సూచనలు కనిపించిన వెంటనే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. వరద ముప్పు ఉన్న గ్రామాల్లో తాత్కాలిక ఆశ్రయ కేంద్రాలు సిద్ధంగా ఉంచాలని, తాగునీరు, ఆహారం, వైద్య సేవలు, విద్యుత్ సరఫరా వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి జిల్లాలో ఇరవై నాలుగు గంటల పాటు పనిచేసే కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని, టోల్ ఫ్రీ నంబర్లను ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని మంత్రి పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సహాయం కోసం చేసే విజ్ఞప్తులపై వెంటనే స్పందించే విధంగా ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. విపత్తు నిర్వహణ, అగ్నిమాపక, వైద్య, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

భారీ వర్షాల కారణంగా రహదారులు దెబ్బతినడం, చెట్లు కూలిపోవడం, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున సంబంధిత శాఖలు ముందుగానే సిద్ధంగా ఉండాలని మంత్రి తెలిపారు. అవసరమైన యంత్రాలు, పంపులు, రక్షణ పరికరాలు, సిబ్బందిని అందుబాటులో ఉంచి అత్యవసర పరిస్థితుల్లో వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. జాతీయ, రాష్ట్ర విపత్తు స్పందన దళాలతో కూడా నిరంతర సమన్వయం కొనసాగించాలని ఆదేశించారు. ప్రజలు అత్యవసర అవసరాలు ఉంటే తప్ప బయటకు రావద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు. వరద ప్రవాహాలు ఉన్న ప్రాంతాలు, వాగులు, చెరువులు, కాలువల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వాతావరణ శాఖ, జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖలు జారీ చేసే హెచ్చరికలు, సూచనలను తప్పని సరిగా పాటించాలని కోరారు. ప్రజల భద్రతే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని, పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

# పాలమూరుకు జలాలపై కర్ణాటక సీఎం కీలక హామీ

- ఆల్మట్టి నుంచి జూరాలకు నీటి విడుదలకు సానుకూల స్పందన
- కర్ణాటక సీఎంతో తెలంగాణ ప్రతినిధుల బృందం భేటీ

**బెంగళూరు, సెప్టెంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు)** అంతర్‌రాష్ట్ర జలాల సమస్యల పరిష్కారం, ఉమ్మడి పాలమూరు జిల్లాలో నెలకొన్న నీటి ఎద్దడిని అధిగమించే లక్ష్యంతో తెలంగాణ ప్రతినిధుల బృందం కర్ణాటకలో కీలక సమావేశం నిర్వహించింది. మంత్రులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు నేతృత్వంలోని బృందం కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను మరోసారి కలిసి ఆల్మట్టి జలాశయం నుంచి జూరాల ప్రాజెక్టుకు నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేసింది. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో పాలమూరు ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించింది. సమావేశంలో తెలంగాణ ప్రతినిధులు ఇప్పటికే సమర్పించిన వినతి పత్రాన్ని ప్రస్తావిస్తూ ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాగు నీరు, తాగునీటి అవసరాలు అత్యవసరంగా ఉన్నాయని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని, పంటలు నీటి కొరతతో నష్టపోతున్నాయని వివరించారు. ప్రజల జీవనాధారాన్ని కాపాడేందుకు తక్షణ చర్యలు అవసరమని పేర్కొన్నారు.పాలమూరు జిల్లాలోని చెరువులు, కాలువలు, జలాశయాల్లో నీటి నిల్వలు గణనీయంగా తగ్గిపోయిన విషయాన్ని తెలంగాణ మంత్రులు కర్ణాటక ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నీటి కొరత కొనసాగితే వ్యవసాయ రంగంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని వివరించారు. ఈ పరిస్థితిని మానవతా దృక్పథంతో పరిశీలించాలని కోరారు. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు కూడా ప్రజల కష్టాలను వివరించారు. సరిహద్దు ప్రాంతాల్లో నీటి అవసరాలు అధికంగా ఉన్నాయని, తక్షణ ఉపశమనం కోసం ఆల్మట్టి నుంచి జూరాలకు నీటి విడుదల అత్యంత అవసరమని తెలిపారు. రాష్ట్రాల మధ్య సహకార భావనతో సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రతినిధుల విన్నపంపై కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. పాలమూరు ప్రాంత పరిస్థితులను అర్థం చేసుకున్న ఆయన నీటి విడుదల అంశాన్ని అత్యవసరంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రాల మధ్య సత్సంబంధాలను కొనసాగిస్తూ ప్రజల అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించినట్లు తెలిసింది. నీటి విడుదలపై వెంటనే చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను డీకే శివకుమార్ ఆదేశించినట్లు సమావేశం అనంతరం తెలంగాణ ప్రతినిధులు వెల్లడించారు. ఈ నిర్ణయం అమలులోకి వస్తే ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాగు, తాగునీటి అవసరాలకు గణనీయమైన ఉపశమనం లభించే అవకాశం ఉందని స్థానిక ప్రజలు, రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఇంజనీర్ల సూచనలు ప్రభుత్వానికి అవసరం: మంత్రి






- ఎల్‌నినో ప్రభావంపై సదస్సు నిర్వహణ
- గుర్రం కోటిరెడ్డి సేవలకు నివాళులు
- ప్రతిభావంతులకు అవార్డుల ప్రదానం
- వ్యవసాయాభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర కీలకం
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు)** ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య ఇంజనీర్స్ భవన్‌లో నిర్వహించిన "ఎల్‌నినో ప్రభావం - సాగునీటిరంగం & వ్యవసాయం" సదస్సులో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ ఇంజనీర్ స్వర్గీయ గుర్రం కోటిరెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం వారి పేరిట ఏర్పాటు చేసిన అవార్డులను ప్రతిభావంతులకు అందజేశారు. సదస్సులో మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొనే వర్షాభావ పరిస్థితులు, కరువు సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ఇంజనీరింగ్ నిపుణుల సూచనలు ఎంతో అవసరమని మంత్రి పేర్కొన్నారు. నీటి నిర్వహణ, సాగునీటి ప్రణాళికలు, జలవనరుల వినియోగంలో శాస్త్రీయ దృక్పథంతో పరిష్కారాలను అందించాలని కోరారు. ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ రంగంపై ఏర్పడే ప్రతికూల పరిస్థితులను ముందుగానే అంచనా వేసి తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని మంత్రి తెలిపారు. నీటి వనరుల సంరక్షణ, సమర్థ వినియోగం, ప్రత్యామ్నాయ సాగు విధానాలపై నిపుణులు ప్రభుత్వానికి మార్గనిర్దేశం చేయాలని సూచించారు. దేశ అభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర అత్యంత కీలకమని కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ముఖ్యంగా సాగునీటి రంగం, మౌలిక సదుపాయాల కల్పన, వ్యవసాయాభివృద్ధిలో ఇంజనీర్ల సేవలు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

స్వర్గీయ గుర్రం కోటిరెడ్డి సాగునీటి రంగానికి అందించిన సేవలు చిరస్మరణీయమని మంత్రి కొనియాడారు. ఆయన చూపిన మార్గంలో నేటి ఇంజనీర్లు కూడా సమాజాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. యువ ఇంజనీర్లు పరిశోధనాత్మక దృక్పథంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సదస్సులో ఇంజనీర్లు, వ్యవసాయ నిపుణులు, సాగునీటి రంగ ప్రతినిధులు పాల్గొని ఎల్‌నినో ప్రభావం, నీటి నిర్వహణ, వ్యవసాయ రంగ భవిష్యత్ సవాళ్లపై చర్చించారు. రాష్ట్ర అభివృద్ధి, రైతుల సంక్షేమం కోసం శాస్త్రీయ సూచనలను ప్రభుత్వానికి అందించేందుకు సహకరిస్తామని నిపుణులు తెలిపారు.

# శాతవాహన కళాశాలలో మంత్రి ఆకస్మిక తనిఖీ





- విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడిన పొన్నం ప్రభాకర్
- హాస్టల్ వసతులు, ఆహార నాణ్యతపై ఆరా
- సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు
- ప్లేస్‌మెంట్లు, క్రీడలకు ప్రాధాన్యం ప్రకటింపు

**హుస్నాబాద్, సెప్టెంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు)** హుస్నాబాద్‌లోని శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకస్మికంగా సందర్శించారు. కళాశాల, హాస్టల్‌లోని వసతులను పరిశీలించిన ఆయన విద్యార్థులతో నేరుగా ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు వివరించిన సమస్యలను స్వయంగా నమోదు చేసుకుని వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హాస్టల్‌లో విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించాలని మంత్రి స్పష్టం చేశారు. ప్రతిరోజూ సిబ్బందిలో ఒకరు విద్యార్థులతో కలిసి భోజనం చేసి ఆహార నాణ్యతను పర్యవేక్షించాలని సూచించారు. అలాగే విద్యార్థులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి భోజనం, వసతులపై వారి అభిప్రాయాలను తెలుసుకోవాలని ఆదేశించారు. తాను హుస్నాబాద్‌కు వచ్చిన ప్రతిసారి విద్యార్థులతో కలిసి భోజనం చేసి వారి సమస్యలను నేరుగా తెలుసుకుంటానని తెలిపారు.

బాయ్స్ హాస్టల్‌లో బాత్రూమ్‌లు సహా ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు అవసరమైన వసతులు, మంచి ఆహారం, రవాణా సదుపాయాలు కల్పించడం తన బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థులు కోరుతున్న బస్సు, రవాణా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. డిపాజిట్‌కు సంబంధించిన ఎలాంటి సమస్య లేదని కూడా స్పష్టం చేశారు. ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఎదుర్కొంటున్న లైబ్రరీ సమస్యను పరిష్కరించాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన క్రీడా సామగ్రిని అందిస్తామని ప్రకటించారు. సమీపంలో స్టేడియం ఉన్నందున విద్యార్థులు క్రీడల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ పోటీల్లోనూ పాల్గొని సమగ్ర అభివృద్ధి సాధించాలని చెప్పారు.

గంజాయి, మాదకద్రవ్యాల వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. డ్రగ్స్, శాంతిభద్రతల అంశాలపై పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కళాశాలలో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందిస్తామని, అవసరమైన వారికి సైకిళ్లు అందించే చర్యలు చేపడతామని ప్రకటించారు. అలాగే క్యాంపస్ సెలెక్షన్లు, ఉద్యోగ అవకాశాల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా తన విద్యార్థి దశ అనుభవాలను గుర్తు చేసుకున్న మంత్రి, 1987లో డిగ్రీ కళాశాల అధ్యక్షుడిగా ఎన్నికై ప్రజా జీవితాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకుని కృషి చేస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని సూచించారు. ప్రభుత్వం విద్యార్థులకు మెరుగైన వసతులు, నాణ్యమైన విద్య అందించేందుకు కట్టుబడి ఉందని పేర్కొంటూ, క్రమశిక్షణతో చదివి జీవితంలో ఉన్నత స్థానాలను చేరుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.

# మాదకద్రవ్యాల ఉచ్చులో యువభారతం

- విద్యాసంస్థల వరకు విస్తరిస్తున్న మత్తు జాలం
- చిన్న వయసులోనే వ్యసనాలకు బానిసలు
- కఠిన చర్యలతో పాటు అవగాహన అవసరం

**డెస్క్, సెప్టెంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు)** దేశంలో యువతలో మాదకద్రవ్యాల వినియోగం ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్నట్లు వివిధ నివేదికలు, నేర గణాంకాలు సూచిస్తున్నాయి. ఒకప్పుడు మహానగరాలు, అంతర్జాతీయ సరిహద్దు ప్రాంతాలకు మాత్రమే పరిమితమైన ఈ సమస్య ఇప్పుడు చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరిస్తోంది. ముఖ్యంగా కళాశాలలు, విద్యాసంస్థలను లక్ష్యంగా చేసుకుని మాదకద్రవ్యాల ముఠాలు తమ కార్యకలాపాలను విస్తరిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. దేశ భవిష్యత్తుగా భావించే యువత వ్యసనాల బారిన పడటం సామాజిక, ఆర్థిక రంగాలపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సామాజిక మాధ్యమాల విస్తరణ, స్నేహితుల ప్రభావం, సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశ, మానసిక ఒత్తిళ్లు వంటి కారణాలు యువతను మాదకద్రవ్యాల వైపు ఆకర్షిస్తున్నాయని విశ్లేషణలు చెబుతున్నాయి. మొదట సరదాగా ప్రారంభమైన అలవాటు క్రమంగా వ్యసనంగా మారి జీవితాలను నాశనం చేస్తోంది. చదువులు, ఉపాధి, కుటుంబ సంబంధాలు దెబ్బతినడంతో పాటు ఆరోగ్య సమస్యలు కూడా పెరుగుతున్నాయి. అనేక సందర్భాల్లో యువత నేర కార్యకలాపాల్లోకి కూడా నెట్టబడుతున్నట్లు పోలీసు దర్యాప్తుల్లో వెలుగులోకి వస్తోంది.

మాదకద్రవ్యాల అక్రమ రవాణా దేశ భద్రతకు కూడా సవాలుగా మారుతోంది. అంతర్జాతీయ ముఠాలు కొత్త మార్గాలను ఉపయోగించి దేశంలోకి మత్తు పదార్థాలను తరలిస్తున్నాయి. ఆన్‌లైన్ వేదికలు, గుప్త సమాచార వ్యవస్థలను వినియోగిస్తూ విక్రయాలు జరుపుతున్నట్లు భద్రతా సంస్థలు గుర్తిస్తున్నాయి. దీంతో చట్ట అమలు సంస్థల ముందున్న సవాళ్లు మరింత పెరుగుతున్నాయి. అక్రమ రవాణా నియంత్రణ కోసం కేంద్ర, రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నప్పటికీ సమస్య పూర్తిగా అదుపులోకి రావడం లేదు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత శారీరక, మానసిక ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటోంది.

జ్ఞాపకశక్తి తగ్గడం, ఏకాగ్రత కోల్పోవడం, మానసిక ఆందోళనలు, హింసాత్మక ధోరణులు, ఆత్మహత్య ఆలోచనలు వంటి అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. కుటుంబాలు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. వ్యసనాల కారణంగా కుటుంబ ఆర్థిక పరిస్థితి దెబ్బతినడంతో పాటు సామాజిక గౌరవం కోల్పోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ ప్రభావం వ్యక్తిగత స్థాయిని దాటి సమాజంపైనా పడుతోంది. ఈ సమస్యను కేవలం పోలీసు చర్యలతో మాత్రమే పరిష్కరించడం సాధ్యం కాదు. కుటుంబాలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ యంత్రాంగం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది. పిల్లల ప్రవర్తనలో మార్పులను తల్లిదండ్రులు గమనించాలి. పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. వ్యసనాలకు గురైన వారికి వైద్య, మానసిక సహాయం అందించే పునరావాస కేంద్రాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. యువతలో మాదకద్రవ్యాల వ్యాప్తి కేవలం ఒక నేర సమస్య కాదు, అది దేశ భవిష్యత్తుకు సంబంధించిన సామాజిక సంక్షోభం. ఈ ముప్పును నిర్లక్ష్యం చేస్తే రాబోయే తరాల సామర్థ్యం దెబ్బతినే ప్రమాదం ఉంది. కఠిన చట్టాలు, సమర్థవంతమైన అమలు, విస్తృత అవగాహన, కుటుంబాల అప్రమత్తత కలిసివస్తేనే ఈ సమస్యను సమర్థంగా ఎదుర్కోవడం సాధ్యమవుతుంది. యువశక్తిని వ్యసనాల బారిన పడకుండా కాపాడడం సమాజం మొత్తం బాధ్యతగా మారింది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in